

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY 5
శ్రీ పొట్టిశ్రీరాములు
నెల్లూరు
జిల్లా వార్తలు
సోమవారం, 18 ఆగస్టు 2025



'సోమశిల'లో 47.840 టీఎంసీలు




అనంతసాగరం ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయానికి ఎగువ నుంచి ఆదివారం 24,087 క్యూసెక్కుల ప్రవాహం వస్తోంది. దీంతో డ్యాంలో 47.840 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. దిగువ కండలేరుకు 8, 150,వరద కాలువకు 1,850, ఉత్తర కాలువకు 340 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నారు.

23న ఒంగోలులో రాష్ట్ర మహాసభలు

- సర్వేపల్లిని నెల్లూరు జిల్లాలోనే ఉంచాలి
- 'స్త్రీశక్తి' ఉచిత ప్రయాణాన్ని స్వాగతిస్తున్నాం..
- మహిళా ఎమ్మెల్యేపై మాజీ ఎమ్మెల్యే వ్యాఖ్యలు సరికాదు
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

నెల్లూరు (వైద్యం) ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి) : ఈనెల 23న ఒంగోలులో సీపీఐ రాష్ట్ర మహాసభలు నిర్వహించను న్నామని, ఈ సభలకు జిల్లా నుంచి పెద్ద సంఖ్యలో పార్టీ శ్రేణులు హాజరుకావాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కే. రామకృష్ణ పిలుపునిచ్చారు. నగరంలోని జెండావీధి షాదీ మంజిల్‌లో ఆదివారం సీపీఐ 26వ జిల్లా మహాసభ జరిగింది. జిల్లాకార్యదర్శి దామా అంకయ్య అధ్యక్షతన జరిగిన ఈ సభలో ముఖ్యఅతిథిగా



పాల్గొన్న రామకృష్ణ మాట్లాడుతూ రాష్ట్ర మహాసభలకు జయప్రదం చేసే బాధ్యత పార్టీనేతలపై ఉందన్నారు. ఇందులో సూపర్‌సిక్స్ పథకాలపైనే ప్రధానంగా చర్చ ఉంటుందన్నారు. స్త్రీశక్తి పథకంలో భాగంగా ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం సౌకర్యం కల్పించడాన్ని తాము స్వాగతిస్తున్నామన్నారు. అయితే ఇది పూర్తిస్థాయిలో అమలు అయ్యేందుకు మరో మూడువేల బస్సులను వెంటనే రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. నెల్లూరు జిల్లాలో ఉన్న సర్వేపల్లిని గూడూరు జిల్లాలో కలపాలని ప్రభుత్వానికి నివేదికలు అందాయన్నారు. దీనివల్ల నెల్లూరు జిల్లాలోని కృష్ణపట్నం వద్ద ఉండే పరిశ్రమలు కనుమరుగయ్యే పరిస్థితి వస్తుందన్నారు. ఈ క్రమంలో సర్వేపల్లి నియోజకవర్గాన్ని నెల్లూరు జిల్లాలోనే ఉంచాలని ఆయన సూచించారు. జిల్లాకు చెందిన ఓ మహిళ ఎమ్మెల్యేపై మాజీ ఎమ్మెల్యే చేసిన వాఖ్యలు సరికాదన్నారు. సీపీఐ జాతీయ నాయకుడు, రైతు సంఘం జాతీయ కార్యదర్శి రావుల వెంకయ్య మాట్లాడుతూ జిల్లాలోని ఉలవపాడు మండలం కరేడు గ్రామంలో ఇండోసోలార్ కంపెనీ కోసం రాష్ట్ర ప్రభుత్వం రైతుల నుంచి బలవంతంగా భూములు లాక్కోవాలని చూస్తున్నదని విమర్శించారు. భూసేకరణ జీవోను వెంటనే ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. జిల్లా ఇన్‌చార్జి, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జగదీస్ మాట్లాడుతూ పీ 4 పథకం ద్వారా పేదరికాన్ని నివారించాలన్న ఉద్దేశ్యంతో ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించేలా ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తున్నదని ఆరోపించారు. అంతకు ముందు నగరంలోని మహబూబ్‌ఖాన్ పార్కు నుంచి షాదీమంజిల్ వరకు కార్యకర్తలు ప్రదర్శన నిర్వహించారు. ఈ సభలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఈశ్వరయ్య, ఏఐటీయూసీ రాష్ట్ర సహాయ కార్యదర్శి వెంకటసుబ్బయ్య, పార్టీ నేతలు పముజుల దశరథరామయ్య, రామరాజు, మాలకొండయ్య, అరిగెల సాయి, సయ్యద్ సిరాజ్, మధు, నందిపోగు రమణయ్య, నాగరాజు, షాన్‌వాజ్, వినోదమ్మ, ఈశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.




నెల్లూరు జెండావీధి షాదీమంజిల్ జరిగిన సీపీఐ జిల్లా మహాసభకు హాజరైన ప్రతినిధులు

బియ్యంలో కల్తీ, తూకాలతో దగా

- ప్రజలను మోసం చేస్తున్న వ్యాపారులు
- 26 కేజీల పేరుతో జీఎస్టీ ఎగనామం
- పట్టించుకోని అధికారులు

8లో..

పేలిన పోలీసు తుపాకీ



- గంజాయి స్మగ్లర్‌ను పట్టుకునే క్రమంలో కాల్పులు
- సినీ ఫక్కీలో వెంబడించి కారు పట్టివేత
- వెంకటాచలం ఘటన మరవక ముందే.. తాజాగా మరో ఘటన
- లారీడ్రైవర్ అప్రమత్తంతో తప్పిన ప్రమాదం
- రోడ్డు, రైలు మార్గాల ద్వారా జిల్లాకు 'మత్తు' దిగుమతి ● ఉలిక్కిపడిన నగరం



గాయాలపాలైన ఈగల్ టీమ్ కానిస్టేబుల్ ఫిరోజ్‌ను పరామర్శిస్తున్న ఐజీ ఆర్‌కే రవికృష్ణ, ఎస్పీ కృష్ణకాంత్ తదితరులు

నెల్లూరు(క్రైం) ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): జిల్లాలో గంజాయి స్మగ్లర్లు రోజురోజుకు రెచ్చిపోతున్నారు. మొన్నటిమొన్న వెంకటాచలం టోల్‌ప్లాజా వద్ద గంజాయి తరలిస్తున్న కారును నిలిపి డీఎస్పీ తనిఖీ చేస్తున్నారు. ఆ సమయంలో స్మగ్లర్లు కారు వేగాన్ని పెంచి దూసుకెళ్లారు. ఈ ఘటనలో డీఎస్పీతోపాటు పలువురు పోలీసులకు గాయాల య్యాయి. ఈ ఘటన మరువకముందే తాజాగా నగరంలోని ఎస్‌వీజీఎస్ కళాశాల మైదానం వద్ద జాతీయరహదారిపై గంజాయి స్మగ్లర్ కారును చుట్టుముట్టిన పోలీసులను ఢీకొని పరారయ్యేందుకు ప్రయత్నించాడు. ఈ ఘటనలో ఈగల్ కానిస్టేబుల్‌కు గాయాలయ్యాయి. స్మగ్లర్లను పట్టుకోవడానికి వచ్చిన పోలీసులను వాహనాలతో ఢీకొట్టే స్థాయికి వారు వచ్చారంటే జిల్లాలో గంజాయి రవాణా ఏస్థాయికి చేరిందో అర్థం చేసుకోవచ్చు.

● కానిస్టేబుల్‌ను ఢీకొట్టి...

చెన్నై వైపునకు ఓ కారులో గంజాయిని తీసుకువస్తున్నారన్న సమాచారం ఎస్పీ జీ. కృష్ణకాంత్‌కు అందింది. దీంతో ఆయన బాలాజీనగర్ పోలీసులను, ఈగల్‌సెల్‌ను అప్రమత్తం చేశారు. బాలాజీనగర్ ఇన్‌స్పెక్టర్ కే. సాంబశివరావు తన సిబ్బంది, ఈగల్‌టీమ్ కానిస్టేబుల్ ఫిరోజ్‌తో కలిసి ఆదివారం తెల్లవారుజామున జాతీయరహదారిపై నిఘా ఏర్పాటు చేశారు. పెన్నాబ్రిడ్జికి ముందు కాపు కాసిన పోలీసులు కారును వెంబడించారు. కారు జాతీయరహదారి నుంచి ఎస్వీజీఎస్ కళాశాల వద్ద యూటర్న్ తీసుకొని అక్కడున్న ఇద్దరు వ్యక్తులకు గంజాయి ఇచ్చేందుకు నిందితుడు కారుని స్లో చేశాడు. అప్రమత్తమైన పోలీసులు వెంటనే కారును చుట్టుముట్టారు. దీంతో గంజాయిని తీసుకునేందుకు వచ్చిన ఇద్దరు వ్యక్తులు పరారయ్యారు. నిందితుడు తప్పించుకునే క్రమంలో పోలీసులను ఢీ కొట్టి, కారును వెనుకకు వేగంగా రివర్స్ తీసి ముందుకు దూసుకెళ్లాడు. కారు వెనుక ఉన్న ఈగల్‌టీమ్ కానిస్టేబుల్ ఫిరోజ్‌ను ఢీకొనడంతో ఆయన ఎగిరి జాతీయరహదారిపై పడ్డారు. అదే సమయంలో ఓ లారీ వేగంగా కానిస్టేబుల్ పైకి వచ్చింది. అయితే డ్రైవర్ అప్రమత్తమై షడన్ బ్రేకులు వేయడంతో కానిస్టేబుల్‌కి స్వల్పగాయాలయ్యాయి. మిగిలిన పోలీసులు తప్పించుకున్నారు. అప్రమత్తమైన బాలాజీనగర్ ఇన్‌స్పెక్టర్ సాంబశివరావు స్మగ్లర్ కారును వెంబడిస్తూ రెండు రౌండ్ల కాల్పులు జరిపారు. అయినా నిందితుడు ఎన్టీఆర్ నగర్‌లోకి దూసుకెళ్లి కారును వదిలి పరుగులు తీస్తుండగా పోలీసులు పట్టుకున్నారు.

● ఉలిక్కిపడిన నెల్లూరు నగరం

జిల్లాలో గతంలో ఎప్పుడో గన్‌తో కాల్పులు జరిపి ఎన్‌కౌంటర్ చేశారు. చిన్నబజారు పోలీసు స్టేసన్ వద్ద జరిగిన అల్లర్లలో ఎస్పీని కాపాడే ప్రయత్నంలో గన్‌మన్ గాల్లో కాల్పులు జరిపాడని విన్నాం. అయితే ఎన్నో ఏళ్ల తరువాత మళ్లీ ఇప్పుడు పోలీసు గన్ గంజాయి స్మగ్లర్‌ను పట్టుకునే క్రమంలో రెండు రౌండ్లు పేలింది. బాలాజీనగర్ ఇన్‌స్పెక్టర్ తన గన్‌తో రెండు రౌండ్లు స్మగ్లర్ కారుపై కాల్చారు. ఆదివారం కావడంతో ఎస్‌వీజీఎస్ కళాశాల మైదానంలో యువత క్రికెట్ ఆడుతుండటం, పెద్దలు వాకింగ్ చేస్తున్నారు. ఆ సమయంలో కాల్పులు జరగడంతో నగరం ఒక్కసారిగా ఉలిక్కిపడింది.

● రోడ్డు, రైలు మార్గాల్లో గంజాయి రవాణా

జిల్లాలో గంజాయి అక్రమ రవాణా రోజురోజుకు పెరిగిపోతోంది. రోడ్డు, రైళ్ల మార్గాల ద్వారా నెల్లూరుకి భారీగా గంజాయి దిగుమతి అవుతున్నది. ఒడిస్సా, మన్యం, ఏజెన్సీ ప్రాంతాల నుంచి గంజాయిని తక్కువ ధరకు కొనుగోలు చేసి, జిల్లాలోని గంజాయి డీలర్లకు అధిక ధరకు అమ్ముతున్నారు. ఇటీవల ఆర్టీసీ బస్సులు, కార్లు, పలు రైళ్లలో వరుసగా గంజాయిని పోలీసులు పట్టుకుంటున్నా, అక్రమ రవాణా మాత్రం ఆగడంలేదు.



బాలాజీనగర్ ఇన్‌స్పెక్టర్ సాంబశివరావు జరిపిన కాల్పుల్లో పగిలిన కారు అద్దం

శభాష్... పోలీస్!

- మంత్రి నారాయణ అభినందన

నెల్లూరు(క్రైం) ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): నెల్లూరులో గంజాయి అక్రమ రవాణాను అరికట్టే విషయంలో పోలీసుల పనితీరు అభినందనీయమని మున్సిపల్‌శాఖా మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ అన్నారు. గంజాయి స్మగ్లర్ దాడిలో గాయపడి చికిత్స పొందుతున్న ఈగల్ టీమ్ కానిస్టేబుల్ పటాన్ ఫిరోజ్ ఆరోగ్య పరిస్థితిపై నారాయణ ఆరా తీసి, ఆయనకు అత్యుత్తమ వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు. కారును వెంబడించి చాకచక్యంగా స్మగ్లర్‌ను అదుపులోకి తీసుకున్న సీఐ సాంబశివరావును, కానిస్టేబుల్ ఫిరోజ్‌ను మంత్రి అభినందించారు. గంజాయి రవాణా, అమ్మకంపై కూటమి ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతున్నదన్నారు. ఈగల్ టీమ్ ద్వారా రాష్ట్రాన్ని గంజాయి, మాదకద్రవ్యాల రహితంగా మారుస్తున్నామన్నామన్నారు. అసాంఘిక కార్యకలాపాల విషయంలో నిబంధనలను మరింత కఠినతరం చేయాలని ఎస్పీ జీ కృష్ణ కాంత్‌కు మంత్రి సూచించారు.

కరేడు మార్గాలన్నీ దిగ్బంధం

- ముందస్తుగా ఆందోళనకారుల అరెస్టులు ● భారీగా మోహరించిన పోలీసులు ● నేటి 'చలో కరేడు'ను అడ్డుకునేయత్నం

ఉలవపాడు, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కరేడు గ్రామ పంచాయతీలో ఇండోసోల్ కంపెనీ బలవంతపు భూసేకరణకు వ్యతిరేకంగా సోమవారం ప్రజాసంఘాలు, రైతుకూలీ సంఘాల ఆధ్వర్యంలో చలో కరేడుకు పిలుపు ఇచ్చిన విషయం తెలిసిందే. గ్రామంలో ఇప్పటికే పోలీసు 30 యాక్ట్, 144 సెక్షన్ అమలులో ఉన్నందున ఎలాంటి సభలు, ప్రచారాలు నిర్వహించ కూడదని ముందస్తు హెచ్చరికలు ఉన్నాయి. ఇందులో భాగంగా డీఎస్పీ బాలసుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో భారీ బందోబస్తులో భాగంగా సుమారు 300 మంది పోలీసులను, స్పెషల్ బెటాలియన్‌ను ఉలవపాడు పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కరేడు గ్రామానికి వెళ్లే అన్ని మార్గాల్లోనూ బారికేడ్లు సిద్ధం చేశారు. ఒంగోలు, కావలి వైపు నుంచి వచ్చే మార్గాల్లో టోల్‌గేట్లు వద్ద ప్రజాసంఘాల నాయకులు, రైతుకూలి సంఘం నేతలను అదుపులోకి తీసుకునేందుకు పోలీసులను ఏర్పాటు చేశారు. కరేడుకు వెళ్లే అలగాయపాలెం రోడ్డు, రామకృష్ణాపురం రోడ్డు, ఉలవపాడు నుంచి వెళ్లే రోడ్లలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఆందోళనకారులు సముద్ర మార్గాన వచ్చే అవకాశం ఉందని(గతంలో రామచంద్ర యాదవ్ పెద్దపల్లెపాలెం నుంచి సముద్ర మార్గం నుంచి హైవే దిగ్బంధంలో పాల్గొన్న విషయం తెలిసిందే) అక్కడా నిఘా ఏర్పాటు చేశారు.



కరేడు వెళ్లే మార్గంలో ఉలవపాడు దర్గా సెంటర్ వద్ద బారికేడ్లు

● నేతల ముందస్తు అరెస్టులు

చలో కరేడు ఉద్యమానికి పిలుపు ఇచ్చిన సీపీఎం నాయకులు కుమార్‌ని ముందస్తుగా ఆదివారం పోలీసులు అరెస్టు చేసి, కందుకూరు పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అలాగే సీపీఎం జిల్లా కార్యదర్శి జీ. వెంకటేశ్వర్లు, మరోనేత జాన్‌ను అదుపులోకి తీసుకొని సింగరాయకొండ సీఐటీయూ కార్యాలయంలో నిర్బంధించారు. ఈ క్రమంలో సోమవారం నిర్వహించే చలో కరేడు కార్యక్రమంపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది.

'ఎంత ఖర్చయినా సరే.. డ్రైవర్‌ను పనిలో నుంచి తీసేయండి' ఇది ఓ సినిమాలోని ఫేమస్ డైలాగ్. హీరో తన అవసరం కోసం డ్రైవర్‌ను పనిలో నుంచి తొలగించేందుకు రూ.లక్షలు ఖర్చు చేస్తాడు. ఇప్పుడు జిల్లాలోని గృహనిర్మాణశాఖలో కూడా ఇదే సీన్ కనిపిస్తోంది. 'ఎంత ఖర్చయినా పర్వాలేదు.. ఆ అధికారులను పంపేయండి' అంటూ అక్రమార్కులు ప్రయత్నాలు మొదలుపెట్టారు. పేదల సొమ్మును దోచుకుంటుంటే అడ్డు తగులుతున్న అధికారులను జిల్లా నుంచి ఎలాగైనా తరిమేయాలంటూ నేతల చుట్టూ తిరుగుతున్నారు. రూ.లక్షలు ఆశచూపుతూ నిక్కచ్చిగా వ్యవహరిస్తున్న అధికారులపై కుట్రలు చేస్తున్నారు. కొందరు అవినీతి అధికారులు కూడా వీరికి సహకరిస్తుండడంతో అక్రమార్కులు బరితెగిస్తున్నారు.

- నెల్లూరు, (ఆంధ్రజ్యోతి)

బరితెగింపు!

- గృహనిర్మాణ శాఖలో రెచ్చిపోతున్న అక్రమార్కులు
- వారిని అడ్డుకుంటున్న కొందరు అధికారులు
- అడ్డుచెప్పేవారిని జిల్లా నుంచి పంపేయత్నం
- కావలిలో సక్సెస్, ఇప్పుడు నెల్లూరులో కుట్ర ?
- నేతల చుట్టూ కాంట్రాక్టర్లు, అధికారుల ప్రదక్షిణలు
- అవినీతిపరులపై చర్యలు తీసుకోకుండా డ్రామాలు



టీపీ గూడూరు మండలం వరిగొండ గిరిజన కాలనీలో పేదల ఇళ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న మంత్రి పార్థసారథి, ఎమ్మెల్యే సోమిరెడ్డి(ఫైల్)

గత ప్రభుత్వంలో దోచుకున్న పేదల సొమ్మును ఇప్పుడు బయటకు తీస్తూ మళ్లీ దోపిడీకి స్కెచ్ వేసినట్లు ప్రచారం జరుగుతోంది. నాలుగునెలల క్రితం సాక్షాత్తూ హౌసింగ్ మంత్రినే జిల్లాలో పర్యటించి పేదల ఇళ్ల నిర్మాణాలను చూసి ఆశ్చర్యపోయారు. ఇంత బరితెగింపు ఎక్కడా చూడలేదంటూ వ్యాఖ్యానిస్తూనే అక్రమార్కులపై క్రిమినల్ చర్యలు తీసుకుంటామని ప్రకటించారు. అయితే ఇప్పటికీ అక్రమార్కులపై చర్యలు తీసుకోకపోగా, పైగా గత ప్రభుత్వంలో దోపిడీ చేసినవారే మళ్లీ హౌసింగ్‌లో చక్రం తిప్పుతుంటుండడం గమనార్హం.

● నిన్న కావలి.. నేడు నెల్లూరు ?

వైసీపీ ప్రభుత్వంలో పేదల ఇళ్ల నిర్మాణంలో దోపిడీ ఏ స్థాయిలో జరిగిందో అందరికీ తెలుసు. చాలాచోట్ల ఇళ్లు నిర్మించకుండానే నిర్మించినట్లుగా బిల్లులు, సిమెంటు, స్టీలు దోపిడీ చేయడం ఒక ఎత్తయితే, కట్టిన ఇళ్లు కూడా అత్యంత నాసిరకంగా నిర్మించడం మరో ఎత్తు. స్వయాన హౌసింగ్ మంత్రి కొలుసు పార్థసారథి, ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి టీపీ గూడూరు మండలం వరిగొండ గిరిజనకాలనీలోని ఇళ్ల నిర్మాణాలను పరిశీలించి ఆశ్చర్యపోయారు. వారు కాళ్లతో తన్నగానే పునాదులు కదిలిపోయాయి. దీన్ని బట్టి ఇళ్ల నిర్మాణం ఎంత నాసిరకంగా జరిగిందో అర్థం చేసుకోవచ్చు. జిల్లా మొత్తం ఇదే పరిస్థితి. ఏ కాలనీకి వెళ్లి చూసినా పగిలిపోయిన ఇళ్లే దర్శనమిస్తు న్నాయి. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక విజిలెన్స్ విచారణ జరగ్గా, అనేక అక్రమాలు బట్టబయ లయ్యాయి. ఇళ్ల నిర్మాణంపై అనేక ఆరోపణలు రావడంతో ఏడాది పాటు కలుగులో దాక్కున్న దొంగ లంతా ఇప్పుడు ఒక్కొక్కరుగా బయటకొస్తూ మళ్లీ పాత పాట అందుకుంటున్నారు. చాలా చోట్ల సిమెంటు, స్టీలు మాయమైంది. కొన్ని చోట్ల బిల్లులు లాగేసుకున్నారు. ఇప్పుడు ఆ అక్రమాలన్నింటినీ సక్రమం చేసుకునేందుకు లబ్ధిదారులకు తెలియకుండానే వారికి సిమెంటు, స్టీలు ఇచ్చినట్లు రికార్డులు సరిచేసే ప్రయత్నాలు చేస్తున్నారు. దీన్ని కావలిలో పనిచేసే ఈఈ అడ్డుకోవడంతో ఇటీవల ఆయన్ను అక్కడి నుంచి బదిలీ చేశారన్న ఆరోపణలున్నాయి. అక్కడ ఓ అవుట్ సోర్సింగ్ ఉద్యోగి చక్రం తిప్పుతున్నట్లు గృహనిర్మాణశాఖలో చర్చించు కుంటున్నారు. నెల్లూరు డివిజన్‌లో కూడా ఇదే తరహాలో దొంగ వ్యవహారాలు చేసేందుకు కొందరు అక్రమార్కులు ప్రయత్నిస్తుండగా, అక్కడ పనిచేసే ఓ అధికారి అడ్డుకుంటున్నట్లు తెలుస్తోంది. ఇప్పుడు అయన్ను కూడా బదిలీ చేయించేందుకు తెరవెనుక ఆర్థికబలం ప్రయోగిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

● విజిలెన్స్ విచారణలో బట్టబయలు

నాడు హౌసింగ్ అధికారులు, కాంట్రాక్టర్లు కుమ్మక్కై పేదల సొమ్ములను తినేసినట్లు తేలింది. ఒక్క నెల్లూరు జిల్లాలోనే సుమారు రూ.110 కోట్ల మేర అవినీతి జరిగినట్లు విజిలెన్స్ అధికారులు ప్రభుత్వానికి నివేదిక అందజేశారు. ఇందుకు అప్పట్లో పనిచేసిన ఏఈ నుంచి పీడీ వరకూ ప్రతీ ఒక్కరికీ పాత్ర ఉందంటూ నిర్ధారించారు. ఇదే విషయంపై జిల్లా స్థాయి సమీక్షలో కూడా మంత్రులు, ఎమ్మెల్యేలు ప్రస్తావించారు. అక్రమార్కులకు పాల్పడిన, వారికి సహకరించిన వారిపై చర్యలు తీసుకోవడంతోపాటు ప్రజల సొమ్మును రికవరీ చేయాలని సమీక్షలో నిర్ణయించారు. అయితే ఆ తర్వాత నలుగురైదుగురిని సస్పెండ్ చేసి హౌసింగ్ ఉన్నతాధికారులు చేతులు దులుపుకున్నారు. ఇంకా అనేకమందికి సంబంధించిన ఫైళ్లను తొక్కిపెట్టినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇక ఒక్క కాంట్రాక్టర్‌పై కూడా చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. పైగా ఇదే కాంట్రాక్టర్లకు మళ్లీ బిల్లులు ఇప్పించేందుకు వేగంగా ఫైళ్లు కదులుతున్నట్లు తెలుస్తోంది.

భలే మంచి

బెల్టు బేరం

- జోరుగా బహిరంగ వేలం
- మొన్న అంకభూపాలపురం, నిన్న అయ్యవారిపల్లె, నేడు బంగారక్కపాలెం... రేపు ఎక్కడో మరి...?
- చోద్యం చూస్తున్న ఎక్సైజ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు

వలేటివారిపాలెం, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని వలేటివారిపాలెం మండలంలో మద్యం బెల్టుషాపులకు బహిరంగ వేలం కొనసాగుతూనే ఉంది. మొన్న అంకభూపాలపురం.. నిన్న అయ్యవారిపల్లె.. నేడు బంగారక్కపాలెం... రేపు మరో గ్రామంలో వీటి వేలం నిర్వహణకు గ్రామస్థులు సమాయత్తమవుతున్నారు. అయితే ఎక్సైజ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు మాత్రం చోద్యం చూస్తున్నారు. ఆరు నెలల క్రితం అంకభూపాలపురంలో అదే గ్రామానికి చెందిన ఓ వ్యక్తి బెల్టుషాపును వేలం ద్వారా రూ. 1.50 లక్షలకు దక్కించుకున్నాడు. నాలుగు నెలల క్రితం అయ్యవారిపల్లెలో ఆ గ్రామానికి చెందిన వ్యక్తి రూ. 9.50 లక్షలకు బెల్టుషాపును వేలం ద్వారా పాడుకున్నాడు. రెండు రోజుల క్రితం బంగారక్కపాలెంలో అదే గ్రామానికి చెందిన వ్యక్తి రూ. 3.02లక్షలకు బెల్టుపాపును వేలం ద్వారా దక్కించుకున్నాడు.

● గ్రామాల్లో బెల్టుకు డిమాండ్

గ్రామాల్లో బెల్టుషాపులకు ఉన్న డిమాండ్‌ను గుర్తించిన గ్రామస్థులు కొందరు గ్రామ పంచాయతీ పాలకవర్గాలతో కలిసి దండోరా వేయించి, బహిరంగ వేలం నిర్వహిస్తున్నారు. మండలంలో పోకూరు, వలేటివారిపాలెం, కళవల్ల గ్రామాల్లో మాత్రమే లైసెన్స్ మద్యం దుకాణాలు ఉన్నాయి. ఇవికాక ప్రతీ గ్రామంలో ఐదారు బెల్టుషాపులు నిర్వహిస్తున్నారు. తమ గ్రామాల్లోనే మద్యం అందుబాటులో ఉండడంతో మద్యం ప్రియులు ఎక్కువ ధర అయినా బెల్టుపాపుల్లోనే కొనుగోలు చేస్తున్నారు. దీంతో గ్రామాల్లో పోటీపడి బెల్టుషాపులు నిర్వహిస్తున్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకొని గ్రామస్థులు పంచాయతీ పాలకవర్గాలతో సంప్రదించి, బెల్టుషాపులకు బహిరంగ వేలం నిర్వహిస్తున్నారు. వేలంలో చెల్లించే నగదు ఆధారంగా రెండేళ్ల వరకు బెల్టుషాపు నిర్వహించుకునే హక్కును కట్టబెడుతున్నారు. వేలంలో బెల్టుషాపు దక్కించుకున్న వ్యక్తి తప్ప ఇతరులెవ రూ మద్యం విక్రయించరాదు. ఒకవేళ ఎవరైనా రహస్యంగా మద్యం విక్రయిస్తే రూ.లక్ష జరిమానా విధించాలని నిర్ణయించారు.

● దాడులతో సంబంధం లేదు..

బెల్టుషాపులపై ఎక్సైజ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు దాడులు చేసి కేసులు నమోదు చేస్తే, తమకెలాంటి సంబంధం లేదని వేలంలో షరతు విధిస్తారు. అందుకు అంగీకరించి పాటదారులు వేలం పాడుకుంటున్నారు. ఎలాంటి చట్టబద్ధత లేని బెల్టుషాపులకు గ్రామ పంచాయతీల పాలక వర్గాలు సంపూర్ణ సహకారం ఉంటోంది. బెల్టుషాపులు కొనసాగించడం చట్టవిరుద్ధమని నిబంధనలు ఉన్నా, ఇంతవరకు అధికారులు నుంచి ఎలాంటి స్పందన లేదు.

● మరికొన్నిచోట్ల నిర్వహణకు కసరత్తు

మండలంలోని మరికొన్ని గ్రామాల్లో బెల్టుషాపుల వేలం నిర్వహణకు కసరత్తు చేస్తున్నారు. బెల్టుషాపులకు బహిరంగ వేలం వేస్తే ఉన్నతాధికారులు దృష్టికి వస్తుందనే ఉద్దేశ్యంతో బెల్టుషాపులు వేలాన్ని రహస్యంగా నిర్వహిస్తున్నారు. గ్రామంలో ఎవరికో ఒకరికి బెల్టుషాపు హక్కును కల్పించి, ఎంతోకొంత చేజిక్కించుకోవాలని కొందరు నేతలు ప్రయత్నాలు తీవ్రతరం చేస్తున్నారు. వేలం నిర్వహణకు ముందుగానే వచ్చే డబ్బుల్లో ఎవరి వాటా ఎంతెంత అనేది నిర్ణయించుకున్న తరువాతే వేలానికి ముహూర్తం ఖరారు చేస్తున్నారు. గ్రామాల్లో 'బెల్టు' వద్దని మహిళల నుంచి డిమాండ్ వ్యక్తం అవుతున్నా, ఎక్సైజ్ అధికారుల నుంచి స్పందన కరువైంది. బెల్టుషాపులు లేవని చెప్పే ఎక్సైజ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు బెల్టుషాపుల వేలంపై ఎలా స్పందిస్తారో వేచిచూడాలి.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	123
స్కిన్ చికెన్	224
స్కిన్‌లెస్	250

కోడిగుడ్ల ధర (100): 520

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ.9553
వెండి కిలో ధర	రూ. 117500
వెండి ఒక గ్రాము	రూ.120.50

వృద్ధులకు అన్నదానం

నెల్లూరు(సాంస్కృతికం), ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి) : ఏపీయూడబ్ల్యూజే 69వ వార్షికోత్సవం సందర్భంగా యూనియన్ నాయకులు ఆదివారం బాలాజీనగర్ గీతామయి వృద్ధుల ఆశ్రమంలో పెద్దలను సన్మానించి వారికి ఫలహారాలు అందజేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర కోశాధికారి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ వృద్ధులను ఆదరించడం అందరి బాధ్యత అన్నారు. ఈ కార్యక్రమంలో జాతీయ కౌన్సిల్ సభ్యులు జయప్రకాష్, యూనియన్ జిల్లా కోశాధికారి హనోకు, డీటీ హరికృష్ణ, మాల్యాద్రి, మురళి, స్వర్ణసింగ్, ఆశ్రమ నిర్వాహకులు పాండు, తదితరులు పాల్గొన్నారు.

'వాత్సల్య'కు నిత్యావసరాల అందజేత

నెల్లూరు(హరనాథపురం), ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి) : వాత్సల్య అనాథ శరణాలయానికి వైద్య ఆరోగ్యశాఖ విశ్రాంత మాస్ మీడియా అధికారి బి.శ్రీనివాసరావు నిత్యావసరాలు అందజేశారు. ఆయన సతీమణి లక్ష్మీప్రసన్న పుట్టిన రోజు వేడుకలు ఆదివారం చిన్నారుల మధ్య జరుపుకున్నారు. ఈ సందర్భంగా రూ.10వేల విలువైన బియ్యం, ఇతర సరకులు అంచేశారు. ఈ కార్యక్రమంలో హంస జిల్లా అధ్యక్షుడు చేజర్ల సుధాకర్‌రావు, వాత్సల్య ఆర్గనైజింగ్ కార్యదర్శి జీవీ సాంబశివరావు, ఆరోగ్యశాఖ రిటైర్డు ఎంప్లాయీస్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి షక్ ఖాదర్‌మస్తాన్, జిల్లా ఉపాధ్యక్షులు జయశ్రీ, తదితరులు పాల్గొన్నారు.

శ్రీకష్ణుడికి విశేష పూజలు

నెల్లూరు(సాంస్కృతికం), ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి) : శ్రీకృషణ జన్మాష్టమి వేడుకల్లో భాగంగా ఆదివారం త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి, ఇందూ జ్ఞాన వేదికల ఆధ్వర్యంలో డైకస్ రోడ్డు సెంటర్‌లో శ్రీకృష్ణ స్వామికి విశేష పూజలు జరిగాయి. ఈ సందర్భంగా భక్తులు శ్రీమద్‌భాగవతాన్ని సామూహికంగా నిర్వహించారు. కార్యక్రమంలో అధ్యక్షుడు సురమౌళీ, వెంకటరత్నం, నరసింహప్రసాద్, రఘు, అన్నపూర్ణ, సునీత, జయసుధ, సునీల్, ఎన్‌సీ.రామయ్య, విజయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

'వీధి దీపాలు' పుస్తకావిష్కరణ


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కవులు

నెల్లూరు(సాంస్కృతికం), ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి) : కవి మోహూరు పెంచల నరసింహం రచించిన వీధి దీపాలు దీర్ఘ కవిత పుస్తకాన్ని నగరంలోని శ్రీవెంకటేశ్వర విద్యాలయంలో ఆదివారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా చిన్ని నారాయణ పాల్గొని మాట్లాడుతూ వీధి దీపాలు దీర్ఘ కవిత శ్రమ జీవుల పక్షాన వకాల్తా పుచ్చుకుని రాసినట్లు ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పెన్నా రచయితల సంఘం అధ్యక్షురాలు గోవిందరాజుల సుభద్రా దేవి, కవులు అవ్వారు శ్రీధర్‌బాబు, ఇంద్రగంటి మధుసూదన్‌రావు, కార్యదర్శి తోట సులోచన, ప్రసూనాశరత్, శివకృష్ణ, దువ్వటి రమేష్, నరేంద్ర, సురేంద్ర, మునీంద్ర, అంకబాబు పాల్గొన్నారు.

పేదలకు వస్త్రదానం


పూజల్లో పాల్గొన్న నిర్వాహకులు

నెల్లూరు (సాంస్కృతికం), ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి) : చిరంజీవి సేవా సమితి బాలాజీనగర్ యూత్ ఆధ్వర్యంలో బాలాజీనగర్‌లో కృష్ణాష్టమి వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. రాధాకృష్ణులు, మహాశివునికి విశేష పూజలు జరిగాయి. మధ్యాహ్నం పేదలకు వస్త్రదాన కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథులుగా డాక్టర్ పోకల రవి, జనసేన మహిళా నేతలు కోలా విజయ, ఆలీయ తదితరులు పాల్గొన్నారు. సాయంత్రం విశేష పూజలు, తీర్థ ప్రసాదాలు పంపిణీ, చిన్నారులచే నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమాలను కొట్టే వెంకటేశ్వర్లు, బాలాజీనగర్ యూత్, తదితరులు పర్యవేక్షించారు.

వైభవంగా వేణుగోపాలుడి కల్యాణం

నెల్లూరు(సాంస్కృతికం), ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): నగరంలోని కాంత్రినగర్ శివకేశవుల ఆలయంలో ఆదివారం రాత్రి కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా ముగిశాయి. అభిషేకాలు, విశేష పూజలు జరిగాయి. నగర ప్రముఖులు పాల్గొని పూజలు చేశారు. సాయంత్రం రుక్మిణీ, జాంబవతి సమేత వేణుగోపాలస్వామి కల్యాణం కనుల పండువగా జరిగింది. శివకేశవ దేవస్థానం ట్రస్ట్ చైర్మన్ దర్శికుంట పెంచలయ్య, ట్రస్టీలు పర్యవేక్షించారు.

రూ.2.08 కోట్లతో కొత్తవెల్లంటి అభివృద్ధి

● నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి


శిలాఫలకాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి

నెల్లూరురూరల్, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి) : టీడీపీ అధికారంలోకి వచ్చాక ఆర్థికంగా వెనకబడిన కొత్తవెల్లంటిని రూ.2.08 కోట్లతో అభివృద్ధి చేశామని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి తెలిపారు. ఆదివారం గ్రామంలో మరో రూ.1.20 కోట్లతో పలు అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తన నియోజకవర్గంలోని గ్రామాలు అన్ని సౌకర్యాలు కలిగిన ప్రాంతాలుగా తీర్చిదిద్దుతున్నామన్నారు. ఊరూరా ప్రజల అవసరాలను గుర్తించి ఆ మేరకు అభివృద్ధి పనులను కేటాయిస్తున్నామని తెలిపారు. ఇందులో ప్రజలు ప్రత్యక్షంగా భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో ఏర్పడ్డాక అభివృద్ధి ఆగడం లేదని, సంక్షేమంతో పాటు పరుగులు తీయిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ విజయకుమార్, టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, ఎమ్మెల్యే కార్యాలయ ఇన్‌చార్జి వేమిరెడ్డి సురేంద్రరెడ్డి, నాయకులు ఇందుపూరు శ్రీనివాసులురెడ్డి, పముజుల ప్రదీప్ ఇతర నాయకుల పాల్గొన్నారు.

నిరుద్యోగ సమస్య పరిష్కారానికి పోరాటం

● డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి రామన్న



మాట్లాడుతున్న డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి రామన్న

నెల్లూరు(వైద్యం), ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర వ్యాప్తంగా నిరుద్యోగుల సమస్య పరిష్కారం కోసం పోరాడుతున్న ఏకైక సంస్థ డీవైఎఫ్ఐ అని ఆ సంస్థ రాష్ట్ర కార్యదర్శి జీ. రామన్న తెలిపారు. ఆదివారం నెల్లూరు నగరం బంగ్లాతోటలోని రత్నం భవన్‌లో భారత ప్రజాతంత్ర సమాఖ్య(డీవైఎఫ్ఐ) నెల్లూరు నగర 21వ మహాసభ జరిగింది. ఈ సభలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో డ్రగ్గ్ వాడే వారి సంఖ్య రోజురోజుకు పెరుగుతుందన్నారు. డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రమణ మాట్లాడుతూ జిల్లాలో పెద్ద ఎత్తున పరిశ్రమలు ఏర్పాటు చేసి నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని, రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చెయ్యాలని కోరారు. ముందుగా డీవైఎఫ్ఐ నగర అధ్యక్షుడు ఉడతా ప్రసాద్ పతాకాన్ని ఆవిష్కరంచారు. అనంతరం నగర నూతన కమిటీని ఏకగ్రీంగా ఎన్నుకున్నారు. నగర అధ్యక్ష, కార్యదర్శులుగా తిరుపతి జగదీష్, బీపీ నరసింహ, కోశాధికారిగా శేఖర్, సహాయ కార్యదర్శిగా నరేంద్ర, ఉపాధ్యక్షులుగా రాజేష్ ఎంపికయ్యారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ, సీఐటీయూ. ఎస్ఎఫ్ఐ, ఐద్వా నేతలు పాల్గొన్నారు.

రోజంతా వర్షపు జల్లులు


కాలువలో పూడికతీత పనులను పరిశీలిస్తున్న కమిషనర్ నందన్

నెల్లూరు(సిటీ), ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): అల్పపీడన ద్రోణి ప్రభావం కారణంగా మారిన వాతావరణంతో ఆదివారం వర్షపు మంకు పట్టుకుంది. రోజంతా జల్లులు పడుతూనే ఉండటంతో నగర వాసులు కొంతవరకు సేదతీరారు. శెలవు రోజుకావడంతో రోడ్లపై తాకిడి తగ్గింది. చిన్నపాటి వర్షానికి నగరంలోని పలు కూడళ్ల, అండర్ బిడ్జిలు, ప్రధాన రహదారులు వద్ద నీరు నిలిచింది. దీంతో రంగంలోకి దిగిన కార్పొరేషన్ యంత్రాంగం ఎక్కడికక్కడ కాలువల్లో పూడితీత పనులు చేపట్టారు. కమిషనర్ నందన్ పలు ప్రాంతాల్లో సిబ్బందితో కలిసి పర్యటించి నీరు నిలవకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. వర్షాలు పడుతాయన్న హెచ్చరికల నేపథ్యంలో లోతట్టు, శివారు ప్రాంతాలలో నీరు వేగంగా బయటకు వెళ్లేందుకు ఇప్పటికే మార్గాలు ఏర్పాటు చేశారు. అటు తాగునీటి పైపు లైన్లపై ఆరా తీసిన ఇంజనీరింగ్ అధికారులు ఎక్కడ లీకేజీలు లేకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

వీఎస్‌జీ ఉత్సవ సమితి కార్యాలయం ప్రారంభం

నెల్లూరు(సాంస్కృతికం), ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): నగరంలోని శివాజీ సెంటర్‌లో విక్రమ సింహపురి గణేష్ ఉత్సవ సమితి కార్యాలయాన్ని ఆదివారం సమితి గౌరవ అధ్యక్షుడు కొండపల్లి శ్రీకాంత్, కార్యనిర్వాహక అధ్యక్షుడు వేలూరు మహేష్‌లు గణేశ్ పూజలు నిర్వహించి ప్రారంభించారు. ఈ సందర్భంగా గౌరవ అధ్యక్షుడు పిట్టి సత్యనాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రజా ప్రతినిధులు, అధికారుల సహాయ సహకారాలతో గణేష్ ఘాట్ అభివృద్ధికి కృషి చేస్తున్నామన్నారు. అధ్యక్షులు కొండపల్లి శ్రీకాంత్ మాట్లాడుతూ వినాయకచవితి ఉత్సవాలకు ఈ ఏడాది కూడా సింగిల్ విండో పద్ధతిన అన్ని అనుమతులు అందిస్తున్నామన్నారు. ప్రధాన కార్యదర్శి మండ్ల ఈశ్వరయ్య, కార్యనిర్వాహక అధ్యక్షుడు వేలూరు మహేష్, పీ సురేంద్రరెడ్డి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో టీ.భాస్కర్‌రెడ్డి, వీ.హర్ష వర్ధన్, ఫణిరాజ్, బి.మల్లికార్జున, మోహన్‌రావు, శివ కుమార్‌ఆచారి, జీవీటీ ప్రభాకర్, శ్రీనివాసులునాయుడు పాల్గొన్నారు.


విక్రమ సింహపురి గణేష్ ఉత్సవ సమితి కార్యాలయంలో చేస్తున్న పూజలు

ఏపీఆర్ఎస్ఏ నెల్లూరు డివిజన్ యూనిట్ ఎన్నిక ఏకగ్రీవం

● అధ్యక్షుడిగా గోపీకృష్ణ, కార్యదర్శిగా నాసర్


ఎన్నికైన ఏపీఆర్ఎస్ఏ నెల్లూరు డివిజన్ యూనిట్ కార్యవర్గం

నెల్లూరు(హరనాథపురం), ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ నెల్లూరు డివిజన్ యూనిట్‌కు ఆదివారం నెల్లూరు ఆర్డీవో కార్యాలయంలో ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల్లో ఆ యూనిట్ అధ్యక్షుడిగా సీహెచ్ గోపీకృష్ణ(ఇందుకూరుపేట తహసీల్దారు), కార్యదర్శిగా షేక్ నాసర్ (నెల్లూరు రూరల్ తహసీల్దారు) ఎన్నికయ్యారు. అసోసియేట్ అధ్యక్షుడిగా జీ.శివయ్య, ఉపాధ్యక్షులుగా బీ.భాగ్యలక్ష్మి, కే.కొండలరావు, పీ.విజయ్‌లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారులుగా బీ.మురళి, శ్రీహరిబాబులు వ్యవహరించారు. ఏకగ్రీవంగా ఎన్నికైన యూనిట్ కార్యవర్గానికి ఏపీఆర్ఎస్ఏ జిల్లా అధ్యక్షుడు అల్లంపాటి పెంచలరెడ్డి అభినందనలు తెలిపారు.

ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి నిత్యావసరాల పంపిణీ


ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి నిత్యావసరాలు పంపిణీ చేస్తున్న నిర్వాహకులు

నెల్లూరు (వ్యవసాయం), ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి వివేకానంద వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. అసోసియేషన్ ఆధ్వర్యంలో చేస్తున్న సేవా కార్యాక మాల్లో భాగంగా డాక్టర్ ఎంఎస్.రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని ఈ కార్యక్రమం చేపట్టినట్లు అసోసియేషన్ అధ్యక్షుడు చింతల అమరేంద్రరెడ్డి, ప్రధాన కార్యదర్శి పొన్నం రవిచంద్ర పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ మాజీ గవర్నర్ రాఘవేంద్రశెట్టి, నేతలు స్వర్ణ రమేష్‌బాబు, బెజవాడ సునీల్‌రెడ్డి, డాక్టర్ అంకిరెడ్డి, గోపాల్‌రెడ్డి, జయదేవ్, చంద్రమౌళి, రాజారమేష్, బుర్రా వెంకటేశ్వర్లుగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

23 నుంచి ఇషా ఫౌండేషన్ గ్రామోత్సవాలు

నెల్లూరు(వ్యవసాయం), ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): ఇషా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈనెల 23వ తేదీ నుంచి గ్రామోత్సవాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. దీనికి సంబంధించిన పోస్టర్లను ఆదివారం సంఘమిత్ర పాఠశాలలో ఆవిష్కరించారు. ఇందులో భాగంగా గ్రామీణ క్రీడాకారులకు ఆటల పోటీలు నిర్వహిచనున్నారు. పురుషులకు వాలీబాల్, మహిళలకు త్రోబాల్ పోటీలు నిర్వహించనున్నారు. గెలుపొందిన రెండు జట్లను విజయవాడలో జరిగే డివిజనల్ లెవల్ పోటీలకు పంపిస్తారు. అక్కడ గెలుపొందిన మొదటి రెండు జట్లు ఫైనల్స్‌లో ఇషా యోగా సెంటర్‌లో సద్గురు సమక్షంలో సెప్టెంబరు 21వ తేదీన తలపడతాయి. ఫైనల్ విజేతకు ప్రైజ్ రూ.5లక్షలు అందజేస్తారు. గ్రామీణ క్రీడాకారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, పూర్తి వివరాలకు మాధవ్ 9440535032, మహేష్ 8179671988, గిరి 9246424773లను సంప్రదించాలని వలంటీర్లు కోరారు.


పొదలకూరులో గేయరచయిత చంద్రబోస్

శ్రేయ ఇన్ఫ్రా డెవలపర్స్ నూతన బ్రాంచ్ ప్రారంభం


మాట్లాడుతున్న రచయిత చంద్రబోస్

పొదలకూరు, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన భవనంలో శ్రేయ ఇన్ఫ్రా డెవలపర్స్ నూతన బ్రాంచ్ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రముఖ సినీ గేయ రచయిత చంద్రబోస్ హాజరై కొత్త బ్రాంచ్‌ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని వర్గాలకూ అనుకూలంగా, అందుబాటులో ఉండేలా మరిన్ని బ్రాంచ్‌లను విస్తరింపజేయాలన్నారు. శ్రేయ ఇన్ఫ్రా డెవలపర్స్ వద్ద ప్లాట్లు కొనుగోలు చేసిన ప్రతి ఒక్కరికీ లబ్ధి చేకూరాలని, సంస్థలో పనిచేసే ఏజెంట్లు, కస్టమర్లు అందరూ ఆనందంగా ఉండాలని ఆకాంక్షిస్తున్నానన్నారు. ఏజెంట్లు, కస్టమర్ల కోరిక మేరకు సినీ గీతాన్ని ఆలపించారు. ఈ కార్యక్రమంలో శ్రేయ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలపర్స్ చైర్మన్ కె. బాబు, బ్రాంచ్ జీఎంలు, ఏజెంట్లు, కస్టమర్లు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య పరీక్షలు


కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

బుచ్చిరెడ్డిపాళెం, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక అంబేద్కర్ భవన్‌లో ఆదివారం చాగణం లలితమ్మ, భాస్కర్‌రావు చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యులు 220 మందికి కంటి పరీక్షలు నిర్వహించి 60 మందికి కంటి అద్దాలు, మందులు పంపిణీ చేశారు. తిరుపతి శ్రీ వేంకటేశ్వర అరవింద్ నేత్రాలయం ఆధ్వర్యంలో ఉచితంగా కంటి ఆపరేషన్లు చేయిస్తున్నట్లు ట్రస్టు ఏఓ గల్లా కృష్ణ తెలిపారు. పేదలకు ఆరు నెలలుగా ఉచిత నేత్ర వైద్య సేవలందిస్తుండడం తృప్తినిస్తోందని ఆయన తెలిపారు. ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వాహకుడు చాగణం గౌరీశంకర్, గండికోట సుధీర్‌కుమార్, నేత్రాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆలయాల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉంది

● కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ● కామాక్షితాయి, మల్లేశ్వర ఆలయ కమిటీ చైర్మన్, సభ్యుల ప్రమాణ స్వీకారం


ధర్మకర్తల మండలి ప్రమాణ స్వీకార కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి

ఇందుకూరుపేట, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి) : దేవాలయాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అన్నారు. ఆదివారం ఇందుకూరుపేటలోని శ్రీకామాక్షితాయి మల్లేశ్వర స్వామి ఆలయ కమిటీ చైర్మన్‌గా తాళ్లూరు భాస్కర్‌నాయుడు, 9 మంది సభ్యులు ఆదివారం ప్రమాణ స్వీకారం చేశారు. ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. స్వామివారికి ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రశాంతమ్మ మాట్లాడుతూ శ్రీకామాక్షితాయి మల్లేశ్వరస్వామి ఆలయానికి దాదాపు 100 ఏళ్ల చరిత్ర ఉందన్నారు. చైర్మన్, కమిటీ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించి ఎక్కడా ఇబ్బందులు లేకుండా చూడాలని, మరింత అభివృద్ధి చేసేందుకు కృషి చేయాలన్నారు. ఆలయాల పరిరక్షణే.. ధర్మానికి బలమని, ధర్మం ఉన్నంతకాలం.. ప్రజలు సుభిక్షంగా ఉంటారన్నారు. ప్రభుత్వం ఆలయాల అభివృద్ధికి ఇప్పటికే రూ.100 కోట్లు కేటాయించిందని, ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలులో భాగంగా ఆలయాల్లో ధూపదీప నైవేద్యాలకు ఇచ్చే మొత్తాన్ని రూ.5వేల నుంచి రూ.10వేలకు పెంచారన్నారు. రాష్ట్రంలో దాదాపు 5,600 దేవాలయాలకు ఈ నిధులను అందిస్తున్నారని వివరించారు. ఈ కార్యక్రమంలో దువ్వూరురెడ్డి, రావెళ్ల వీరేంద్ర నాయుడు, సూదలగుంట నాగార్జున నాయుడు, చెంచు కిషోర్ యాదవ్, మునగాల రంగారావు, పముజుల రవి, మాదాల రమేష్‌నాయుడు, చెన్నయ్య, దేవస్థాన కమిటీ మెంబర్లు, తదితరులు పాల్గొన్నారు.

సొసైటీలు అన్నదాతలకు ఉత్తమ సేవలందించాలి

అన్నదాతలకు అండగా ప్రభుత్వం పనిచేస్తుందని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అన్నారు. ఆదివారం ఇందుకూరుపేట అగ్రికల్చర్ క్రెడిట్ సొసైటీ చైర్మన్ అమర్‌నాథ్ రెడ్డి, డైరెక్టర్లు పెనుబల్లి కృష్ణచైతన్య, సూదులగుంట స్నేహలత ప్రమాణ స్వీకార కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే స్థానిక రైతులతో ముచ్చటించారు. సొసైటీ చైర్మన్, డైరెక్టర్లుగా ప్రమాణ స్వీకారం చేసిన వారు రైతులకు ఉత్తమ సేవలు అందించాలన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు సంక్షేమ పాలన సాగిస్తున్నారన్నారు. రైతులకు ఎరువులు, పురుగు మందులు, ఆక్వా సాగు అధికంగా ఉన్న ప్రాంతాల్లో చేపల మేత కూడా సొసైటీ అందిస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో దువ్వూరు కళ్యాణ్‌రెడ్డి, కోడూరు కమలాకర్‌రెడ్డి, జడ్పీ వైస్ చైర్మన్ జయలక్ష్మి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి రావెళ్ల వీరేంద్రనాయుడు, పవన్‌రెడ్డి, చెంచు కిషోర్‌యాదవ్, మునగాల రంగారావు, తదితరులు పాల్గొన్నారు.

శ్రీహరికోట తీరంలో బోటు కలకలం

● బోగోలు మండలం జువ్వలదిన్నె వాసిగా గుర్తింపు

● విచారణానంతరం పంపేసిన పోలీసులు

సూళ్లూరుపేట, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): శ్రీహరికోట సముద్ర తీరం ఒడ్డున ఓ పడవ ప్రత్యక్షమవడంతో కలకలం రేగింది. శ్రీహరికోట పోలీసుల సమాచారం మేరకు.. ఆదివారం తెల్లవారుజామున షార్‌లోని సముద్రపు ఒడ్డున పడవతో ఓ వ్యక్తి తిరుగుతుండడంతో బందోబస్తు లో ఉన్న సీఐఎస్ఎఫ్ సిబ్బంది గుర్తించారు. బోటుతో పాటు అతడిని అదుపులోకి తీసుకుని విచారించారు. అనంతరం శ్రీహరికోట పోలీసులకు అప్పగించారు. పోలీసుల విచారణలో.. అతడు నెల్లూరు జిల్లా బోగోలు మండలం జువ్వలదిన్నె గ్రామానికి చెందిన సీహెచ్ శ్రీనివాసులు అనే మత్స్యకారుడని తేలింది. చెన్నై వెళ్లి సముద్రంలో చేపలవేట చేసే బోటును కొనుగోలు చేశారు. ఆ బోటును తీసుకుని చెన్నై నుంచి సముద్ర తీరానే శ్రీహరికోట మీదుగా కావలికి వెళుతున్నాడు. సరిగ్గా షార్ వద్దకు వచ్చేసరిగా బోటులో మోటారు మొరాయించింది. చేసేదేమి బోటును సముద్రం ఒడ్డుకు తీసుకొచ్చాడు. సమీపంలో విధుల్లో ఉన్న సీఐఎస్ఎఫ్ సిబ్బంది అనుమానంతో బోటు యజమాని శ్రీనివాసులును అదుపులోకి తీసుకున్నట్లు తేలింది. జువ్వలదిన్నెవాసిగా తేలడంతో, అక్కడి పోలీసులకు సమాచారం ఇచ్చి పూర్తి వివరాలు తెలుసుకున్నాక బోటు యజమానిని పంపించేశారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం

ఉదయగిరి, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని గండిపాళెం ఎస్సీ కాలనీకి చెందిన యాసారపు దేవయ్య ఇటీవల గుండెపోటుతో మృతిచెందడంతో విషయం తెలుసుకున్న ఐటీడీపీ నియోజకవర్గ ఇన్ చార్జి రెడ్డిబత్తిన ఉమాసాయిరాం ఆదివారం తన ప్రతినిధులచే ఆ కుటుంబానికి రూ.5 వేలు ఆర్థికసాయం అందజేశారు. దేవయ్య కుటుంబ పరిస్థితిని ఎమ్మెల్యే కాకర్ల సురేష్ దృష్టికి తీసుకెళ్లి ఆర్థికంగా ఆదుకునేలా చర్య లు చేపడతామని వారు కుటుంబ సభ్యు లకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ, జనసేన నాయకులు ఇమ్రాన్, భాస్కర్, సునీల్, నవీన్ పాల్గొన్నారు.

మరమ్మతుల పేరిట గ్రావెల్ విక్రయం


కాలువను పరిశీలిస్తున్న సురేష్ నాయుడు

ముత్తుకూరు, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి) : డ్రైన్ మరమ్మతుల పేరిట టెండర్లు కూడా పిలవకుండానే గత వైసీపీ ప్రభుత్వంలో రూ.కోట్ల గ్రావెల్ తవ్వుకొని అమ్ముకున్నారని సర్వేపల్లి నియోజకవర్గ జనసేన పార్టీ సమన్వయ కర్త బొబ్బేపల్లి సురేష్ నాయుడు ఆరోపించారు. ఆదివారం పొట్టెంపాడు వద్ద నక్కల కాలువను, అస్తవ్యస్తంగా ఉన్న వంతెనను పరిశీలించారు. కాలువలో గ్రావెల్‌ని అక్ర మంగా తవ్వుకొని రూ.కోట్లలో దోచుకున్నా రన్నారు. నక్కల కాలువలో గుర్రపు డెక్క విపరీతంగా పెరిగిపోయిందని గ్రామస్తులు చెప్పారన్నారు. వంతెన నిర్మాణం జరిగేలా ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళతామన్నారు. కార్యక్రమంలో పినిశెట్టి మల్లికార్జున్, సందూరి శ్రీహరి, పొట్లూరు సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

కనులపండువగా శ్రీకృష్ణ కల్యాణం!


కల్యాణంలో పాల్గొన్న టీడీపీ అధ్యక్షుడు మల్లికార్జునయాదవ్

ముత్తుకూరు, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి) : ముత్తుకూరులో ఆదివారం శ్రీకృష్ణ మందిరంలో రుక్మిణీ, సత్యభామ సమేత మురళీకృష్ణ స్వామి కల్యాణ మహోత్సవం వైభవంగా జరిగింది. ఉదయం నుంచే భక్తులు ఆలయా నికి అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామి దర్శనం చేసుకున్నారు. మంత్రోచ్ఛరణల నడు మ శాస్త్రోక్తంగా కళ్యాణో త్సవాన్ని నిర్వహిం చారు. ఉభయకర్తలు నీలం మల్లికార్జున యాదవ్, ప్రవీణ, సాయి ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. రుక్మిణీ, సత్యభామ లతో కలిసి శ్రీకృష్ణునికి చేసిన ప్రత్యేక అలంకా రాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. 'గోవింద.. గోపాల' నామ స్మరణలతో ఆలయం మార్మోగింది. సంగీత వాద్యాలు, హారతుల మధ్య కళ్యాణం కన్నులపండువగా సాగింది. ఆలయ వేదికను పూలు, విద్యుద్దీ పాలతో అందంగా అలంకరించారు. కళ్యాణం చూసేందుకు చుట్టుపక్కల గ్రామాల నుంచి మహిళలు, పిల్లలు, యువత తరలివచ్చారు. భక్తి శ్రద్ధలతో ఆద్యంతం తిలకించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. భక్తులందరూ స్వామి కళ్యాణ దర్శనం లభించిందని ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సిద్ధేశ్వరాలయం చైర్మన్ మామిడాల శ్రీనివాసులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

వైభవంగా మాతమ్మ విగ్రహ ప్రతిష్ఠ


విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొన్న గ్రామ పెద్దలు

మనుబోలు, ఆగస్టు 17 (ఆంధ్ర జ్యోతి): పిడూరు మిక్సిడ్ కాలనీలో ఆదివారం మాతమ్మ విగ్రహ ప్రతిష్ఠ వైభ వంగా నిర్వ హించారు. మూడు రోజులుగా అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాలను వేదపండితులు సోమరాజుపల్లి సాయి సునీల్ శర్మ ఆధ్వర్యంలో వేదమంత్రాలతో శాస్త్రోపేతంగా బుత్వికులు నిర్వహిస్తున్నారు. ఆదివారం ఉదయం అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని పిడూరు గ్రామ పెద్దలు నిర్వహించారు. అనంతరం శిఖరప్రతిష్ఠ చేశారు. ప్రత్యేకంగా అలంక రించిన అమ్మవారిని భక్తులు దర్శనం చేసు కున్నారు. భక్తులకు తీర్థ, ప్రసాదాలతో పాటు అన్న సంతర్పణ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామపెద్దలు మోడెం కృష్ణమోహన్ రెడ్డి, మన్నెమాల సాయిమోహన్ రెడ్డి, తిక్కవరపు వెంకటేశ్వర్లు రెడ్డి, వెంకటరమణారెడ్డి, పుల్లా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కనీస వేతన చట్టం అమలు చేయాలి

కోవూరు, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ కూలీలకు కనీస వేతనాల చట్టం ప్రకారం కూలీ చెల్లించాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు జొన్నలగడ్డ వెంకమరాజు డిమాండ్ చేశారు. స్థానిక సీతాపోలయ్య భవనంలో ఆదివారం ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం మండల మహాసభలో ఆయన మాట్లాడారు. పుచ్చలపల్లి సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాయకులు విజయ కుమార్, బట్టా పెద్దబ్బయ్య, లీలమ్మ, కల్పన, రత్నమ్మ, బుజ్జయ్య తదితరులు పాల్గొన్నారు.



చెక్కుచెదరని ఇరిగేషన్ బంగళా...!

వెంకటాచలం, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): దేశాన్ని సుదీర్ఘకాలం పాటు పరిపాలించిన ఆంగ్లేయులు లేకపోయినా వారు నిర్మించిన పలు కట్టడాలు నేటికీ చెక్కుచెదరకుండా ఉన్నాయి. మండలంలోని జోసఫ్‌పేట సమీపంలోని సర్వేపల్లి రిజర్వాయర్ వద్ద ఉన్న ఇరిగేషన్ బంగళా వీటిలో ఒకటి. స్వాతంత్ర్యానికి పూర్వం ఆంగ్లేయులు సర్వేపల్లి రిజర్వాయరును నిర్మించారు. అయితే రిజర్వాయర్ సందర్శనకు వచ్చే అధికారులు విశ్రాంతి తీసుకోవడానికి వీలుగా రిజర్వాయర్ వద్ద 1880లో ఈ బంగళాను నిర్మించి ఉంటారని ఇంజనీరింగ్ నిపుణులు తెలిపారు. ఎంతో సుదీర్ఘ చరిత్ర కలిగిన ఈ బంగళా నేటికీ చెక్కు చెదరలేదు. నాటి కట్టడాల ధృఢత్వానికి నిలువుటద్దంగా మారింది.

వైభవంగా శ్రీకృష్ణుడి గ్రామోత్సవం

బిట్రగుంట, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): బోగోలు యాదవపాలెంలో ఉన్న కోదండరామాలయ ఆవరణలోని శ్రీకృష్ణ ఆలయంలో కృష్ణష్టామి సంబరాల్లో భాగంగా ఆదివారం రుక్మిణి, సత్యభామ సమేత శ్రీకృష్ణుడి గ్రామోత్సవం ఘనంగా జరిగింది. యాదవపాలెం యువత ఆధ్వర్యంలో కోలాటం భజన నృత్యాలతో గ్రామోత్సవం నిర్వహించారు. పురప్రజలు స్వామి, అమ్మవార్లకు కాయా కర్పూరం సమర్పించారు.



పోలేరమ్మ తిరుణాళ్ల ప్రారంభం

కలిగిరి, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పో లంపాడు గ్రామంలో పోలేరమ్మ తిరుణాళ్ల ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. గురువారం వరకు ఉత్సవాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అమ్మ వారు ప్రతిరోజూ విశేష అలంకారంతో భక్తులకు దర్శనమిస్తారన్నారు. గురువారం ఆలయం వద్ద పొంగళ్లు, ఎడ్ల బండలాగుడు పోటీలు చేపడతామన్నారు. ఆలయం వద్ద నిత్యాన్నదానం, సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయన్నారు. మండలంలోని భక్తులు పెద్ద సంఖ్యలో అమ్మవా రిని దర్శించుకొని తీర్థప్రసాదాలు స్వీకరించాలని ఆలయ నిర్వాహకులు కోరారు.



కల్తీ, తూకాలతో దగా

- ప్రజలను మోసం చేస్తున్న బియ్యం వ్యాపారులు
- రంగురంగుల ప్యాకింగ్‌తో రైస్ బ్యాగ్స్
- 26 కేజీల తూకం పేరుతో జీఎస్టీ ఎగనామం

కావలి, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): ధాన్యం మిల్లింగ్‌తో వచ్చే బియ్యం కొంచెం అటుఇటుగా ఒకేరకంగా ఉంటున్నాయి. అయితే వాటిని విక్రయించేందుకు మిల్లర్లు, వ్యాపారులు రంగురంగుల బస్తాల్లో ప్యాకింగ్ చేసి, వాటిని వివిధ పేర్లతో అధిక ధరలకు విక్రయిస్తున్నారు. రేషన్ షాపులలో ఇప్పుడు సన్నబియ్యం వస్తుండటంతో ఆ బియ్యాన్ని మిల్లర్లు, వ్యాపారులు ప్యాకింగ్‌బియ్యం పేరుతో ప్రజలకు అమ్మే వాటిలో కల్తీ చేస్తున్నారు. అలాగే బియ్యం తూకాల్లో కూడా మోసం చేస్తున్నారు. 25 కిలోల బియ్యం బస్తాకు ఒకటి, రెండు కిలోలు తగ్గించి వాటిని 25 కిలోల కింద విక్రయిస్తున్నారు. 25 కిలోల బియ్యం బస్తాకు జీఎస్టీ చెల్లించాలని ప్రభుత్వం ఉత్తర్వులు ఉండటంతో 25 కిలోల బస్తాకు బదులుగా 26 కిలోల బస్తాలని బిల్లులు వేసి జీఎస్టీ ఎగకొట్టి ప్రభుత్వ ఖజానాకు గండికొడుతున్నారు.

● మామూళ్ల మత్తులో అధికారులు

ప్రతీ దుకాణంలో 25 కిలోల, 26 కిలోల బస్తాల నిఖరతూకం చూపించాలి. అయితే తూకం తక్కువ విషయంలో కానీ, జీఎస్టీ చెల్లించని విషయంలో కానీ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవటంలేదనే ఆరోపణలు ఉన్నాయి. వివిధ శాఖల అధికారులు రైస్‌మిల్లర్లు, వ్యాపారుల వద్ద నెల మామూళ్లు తీసుకుని వినియోగదారులకు అన్యాయం జరుగుతున్నా, ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతున్నా పట్టించుకోవటంలేదనే ఆరోపణలు ఉన్నాయి.

● తూకం తగ్గించి, కల్తీ చేసి...

బియ్యం వాడకం తగ్గిన తర్వాత గ్రామాల్లో ధాన్యం పండించిన రైతులు సైతం తమ ధాన్యాన్ని మిల్లింగ్ చేసుకోవడం లేదు. బియ్యం కొనుగోలు చేసుకునే తింటున్నారు. దీంతో బియ్యం వ్యాపారం మూడు పూవులు ఆరుకాయలుగా వర్ధిల్లుతోంది. అయితే ఈ బియ్యం వ్యాపారంలో బ్రాండెడ్ కంపెనీలు పెద్దగా లేకపోవటంతో అంతా లోకల్‌గా విక్రయిస్తుంటారు. లోకల్ బ్రాండ్లు ఒక నెలలో కొన్నవి మరో నెలలో ఉండవు. వాటిని తరచూ మారుస్తుంటారు. అయితే రైస్‌మిల్లర్లే కొందరు లోకల్ బ్రాండ్లు ఉన్న బస్తాలతో బియ్యం నింపి బియ్యం వ్యాపారులకు విక్రయిస్తుంటారు. మరికొందరు హోల్‌సేల్ బియ్యం వ్యాపారులైతే వారే ధాన్యం కొనుగోలు చేసుకుని మిల్లింగ్ వేయించి తమ ఇస్టానుసారంగా బ్రాండ్ల పేరుతో విక్రయాలు జరుపుతుంటారు. తక్కువ ధరకు విక్రయించేందుకు ఎక్కువ శాతం రేషన్ బియ్యం కలపటమే కాక, తూకాల్లో కూడా తగ్గించి విక్రయిస్తున్నారు.






నెల్లూరులో ప్రదర్శన నిర్వహిస్తున్న సీపీఐ నాయకులు, కార్యకర్తలు

ఎవరెన్ని విమర్శలు చేసినా మాకు ప్రత్యేక గుర్తింపు

- వైసీపీ బాటలోనే రాష్ట్ర ప్రభుత్వం అప్పులు చేస్తోంది
- ఓటు హక్కును కాలరాసేందుకు కేంద్రం యత్నం
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

నెల్లూరు (వైద్యం) ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): ఎవరెన్ని విమర్శలు చేసినా దేశంలో కమ్యూనిస్టు పార్టీకి ప్రత్యేక గుర్తింపు ఉందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కే. రామకృష్ణ అన్నారు.నెల్లూరు జెండావీధిలోని షాదీమంజిల్‌లో ఆదివారం సీపీఐ జిల్లా మహాసభ జరిగింది. ఈ సభలో ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్య వచ్చాక దేశంలో కేవలం రెండు పార్టీలే ఉన్నాయని, అవి కాంగ్రెస్, కమ్యూనిస్టుపార్టీలేనని తెలిపారు. అయితే బీజేపీని చెప్పుచేతల్లో పెట్టుకున్న ఆర్‌ఎస్‌ఎస్ దేశంలో కమ్యూనిస్టు పార్టీ కనుమరుగవుతుందని జోస్యం చెబుతున్నదని, వారి ఆటలు సాగవని సరైనరీతిలో తిప్పి కొడతామన్నారు. సమస్యల పరిష్కారం కోసం కార్మికవర్గానికి బాసటగా నిలిచి అనేక పోరాటాలు చేసి సత్ఫలితాలు సాధించామని చెప్పారు. రైతు సమస్యలపై ఢిల్లీ సరిహద్దుల్లో రైతులు 3 నెలల పోరాడి 750 మంది రైతులు ఆత్మార్పణ చేసి కేంద్ర ప్రభుత్వం మెడలు వంచారన్నారు. దీంతో ప్రధాని మోదీ దిగివచ్చి రైతుల డిమాండ్‌లను అంగీకరించారన్నారు. ఓటు హక్కును కాలరాసేందుకు కేంద్రం ప్రయత్నిస్తున్నదని, బిహారులో తొలగించిన లక్షల ఓట్లు ఏమయ్యాయని ఆయన ప్రశ్నించారు. కాగా రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం వైసీపీ బాటలోనే నడుస్తున్నదని, ఏడాది కాలంలోనే రూ.1.70 లక్షల కోట్ల అప్పులు చేసిందన్నారు. అమరావతి రాజధానికి అక్కడ రైతులు 34వేల ఎకరాల భూమిని స్వచ్ఛందంగా ఇస్తే, మరో 45 వేల ఎకరాలు కావాలని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింద న్నారు. ఇందులో ఎయిర్‌పోర్టు విస్తీర్ణంతోపాటు మరికొన్ని నిర్మాణాలకు ఈ భూములు అడుగుతుందని రామకృష్ణ తెలిపారు. వివిధ కర్మాగారాల నిర్మాణాల కోసం వేలఎకరా లను పారిశ్రామికవేత్తలను కట్టబెట్టేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తున్నదని ఆయన విమర్శించారు. ఈ సభలో సీపీఐ జాతీయ సమితి నాయకులు రావుల అంకయ్య, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జగదీష్, ఈశ్వరయ్య, హరినాథ్‌రెడ్డి, ఏఐటీయూసీ రాష్ట్ర సహాయ కార్యదర్శి వెంకటసుబ్బయ్య, సీపీఐ జిల్లా కార్యదర్శి దామా అంకయ్య తదితరులు పాల్గొన్నారు.

కుటుంబ కలహాలతో ఉరేసుకుని యువకుడి ఆత్మహత్య



నెల్లూరు(క్రైం), ఆగస్టు 17(ఆంధ్ర జ్యోతి): భార్యాభర్తల మధ్య ఏర్పడిన కుటుంబ కలహాల నేపథ్యంలో ఓ యువకుడు మనస్థాపానికి గురై నగరంలోని వేదాయపాలెం రైల్వే స్టేషన్ బయట చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల సమాచారం మేరకు.. పొదలకూరు రోడ్డు సంజయ్‌గాంధీ నగర్‌లో నివాసం ఉంటున్న సంపూర్ణమ్మకు ఇద్దరు కుమార్తెలు, ఇద్దరు కుమారు లు. రెండవ కుమారుడు సబ్బు శ్రీకాంత్(36) నగరంలోని యూనియన్ బ్యాంకులో తాత్కాలిక అటెండర్‌గా పనుచేస్తున్నారు. పదేళ్ల క్రితం రాజ్య లక్ష్మిని ప్రేమ వివాహం చేసుకోగా ఆమె సచివాలయంలో ఉద్యోగం చేస్తూ సంజయ్‌గాంధీనగర్‌లో నివాసం ఉంటున్నారు. వీరికి ఒక కుమా రుడు సంతానం. కొంత కాలంగా భార్యాభర్తల మధ్య మనస్పర్థలు రావ డంతో ఇద్దరు తరచూ గొడవ పడేవారు. ఈ క్రమంలో శ్రీకాంత్ తల్లి వద్ద ఉంటుండగా ఈనెల 16వ తేదీ రాత్రి రాజ్యలక్ష్మి వేదాయపాలెం పోలీసు స్టేషన్‌లో భర్తపై ఫిర్యాదు చేసింది. పోలీసులు స్టేషన్‌కు రమ్మ ని పిలవడంతో శ్రీకాంత్ తల్లితో స్టేషన్‌కు వచ్చాడు. రాత్రి 9.30 నిమి షాల ప్రాంతంలో పోలీసు స్టేషన్ నుంచి బయలుదేరి తల్లిని ఇంటి వద్ద వదిలిపెట్టి శ్రీకాంత్ బయటకు వెళ్లాడు. మనస్థాపానికి గురైన శ్రీకాంత్ వేదాయపాలెం రైల్వే స్టేషన్ బయట పల్సర్ బైక్‌పై ఎక్కి చెట్టుకు చీరతో ఉరి వేసుకొని బైక్‌ను పక్కకు నెట్టేసి ఆత్మహత్య చేసుకున్నాడు. ఆదివా రం తెల్లవారుజామున స్థానికులు గమనించి వేదాయపాలెం పోలీసుల కు సమాచారం అందించారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని కిందకు దించి పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్ మార్చురీ కు తరలించారు. మృతుడు తల్లి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వివాహిత ఆత్మహత్యాయత్నం

ఏఎస్ పేట, ఆగస్టు17 (ఆంధ్రజ్యోతి): వివాహిత ఆత్మహత్యాయత్నం చేసుకున్న సంఘటన ఆదివారం రాత్రి ఏఎస్ పేట గ్రామంలో చోటుచేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. చాకలి వీధిలో శశికళ అనే మహిళ అద్దె ఇంట్లో ఒంటరిగా నివాసం ఉంటోంది. ఆదివారం రాత్రి ఆమె చేతులు, కాళ్లు కోసుకుని ఆత్మహత్యా యత్నానికి పాల్పడింది. గమనించిన చుట్టుపక్కల వారు 108కి సమాచారం అందించి చికిత్స నిమిత్తం ఆమెను ఆత్మకూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. దీనికి సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

ముస్సిపల్ షాపు కోసం వివాదం

- పోలీసులకు ఫిర్యాదు.
- రూరల్ స్టేషన్‌కు చేరిన పంచాయితీ

కావలి రూరల్, ఆగస్టు17 (ఆంధ్ర జ్యోతి): కావలి పట్టణం ముసునూరులో ఉన్న ముస్సిపల్ షాపు కోసం చెలరేగిన వివాదం చిలికి చిలికి గాలివానలా మారింది. ఆదివారం తమ ఇంటి పైకి వచ్చి దాడి చేశారన్న ఫిర్యాదుతో వివాదం పోలీస్‌స్టేషన్ వరకు చేరింది. విశ్వసనీయ సమాచారం మేరకు... ముసునూరులోని ముస్సిపల్ షాపుల సముదాయంలో రెండు దుకాణాలను స్థానిక టీడీపీ సీనియర్ నాయకుడు బొట్లగుంట శ్రీహరినాయుడు, వారి అనుయాయులు 6 సంవత్సరాల క్రితం లీజుకు పాడుకున్నారు. వాటిలో ఖాళీగా ఉన్న దుకాణం మాకు అద్దెకు ఇవ్వాలని ముసునూరుకు చెందిన అన్నదమ్ములు కన్నం కృష్ణ శ్రీధర్‌లు శ్రీహరినాయుడును అడగ్గా దానిని అరుందతీయవాడకు చెందిన మందా మురళి ఇటీవల అద్దెకు తీసుకున్నాడని, అతను వద్దంటే మీకు ఇస్తానని చెప్పినట్లు తెలిసింది. కాగా, ఆ దుకాణం తాళాలు మురళికి ఇవ్వాలని ఈనెల 15వ తేదీన పక్కనే ఉన్న టీషాపు నిర్వాహకుడు వెంగయ్యకు ఇవ్వగా అక్కడకు చేరుకున్న కన్నం కృష్ణ వెంగయ్య వద్ద నుంచి ఆషాపు మమ్ములను ఎమ్మెల్యే దగ్గుమాటి వెంకట క్రిష్టారెడ్డి తీసుకోమన్నారు అంటూ బలవంతంగా తాళాలు లాక్కుని వెళ్లిపోయాడు. దీంతో శ్రీహరినాయుడితో పాటు ఆయన కుమారుడు శశి, దుకాణం అద్దెకు తీసుకున్న మురళి, పోతిపోగు వెంకటేశ్వర్లు తాళాల కోసం కృష్ణ ఇంటికి వెళ్లారు. అక్కడ వారి మధ్య వివాదం తలెత్తటంతో కృష్ణతో పాటు అన్న శ్రీధర్, కృష్ణ భార్య రాధపై దాడి చేసి ఫోన్ లాక్కుని వెళ్లారని రాధ రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. దీంతో ఎస్‌ఐ తిరుమలరెడ్డి విచారణ నిమిత్తం మురళి, వెంకటేశ్వర్లును పోలీస్‌స్టేషన్‌కు తీసుకురావడంతో పాటు ముసునూరు వద్ద శ్రీహరి నాయుడును స్టేషన్‌కు రావాలని పోలీసులు చెప్పడంతో అతను స్టేషన్‌కు చేరుకున్నాడు. సిఐ రాజేశ్వరరావు ఇరువర్గాలను విచారించి పంపారు. కాగా, టీడీపీ సీనియర్ నాయకుడు శ్రీహరినాయుడును స్టేషన్‌లో ఉంచారన్న వార్త పట్టణంలో చర్చనీయాంశంగా మారటంతో హరిజన, అరుందతీయ వాడల నుంచి యువకులు స్టేషన్‌కు చేరుకుని శ్రీహరినాయుడును పరామర్శించారు. ఈవిషయంపై అక్కడకు చేరిన మీడియా శ్రీహరినాయుడును వివరణ కోరగా స్టేషన్‌కు రమ్మనటం తనకు జరిగిన అవమానమేనని, దీనిపై ఇప్పుడు ఏమీ మాట్లాడనని సున్నితంగా తిరస్కరించారు.

నూర్‌బాషా (దూదేకుల) సంక్షేమ సంఘం నూతన కమిటీ ఎన్నిక

నెల్లూరు(హరనాథపురం), ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి) : నూర్‌బాషా దూదేకుల (బీసీ) సంక్షేమ సంఘం నూతన కమిటీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం నగరంలోని టౌన్‌హాల్లో ఆ సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు షేక్ ఖాదర్ బాషా ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో జిల్లా అధ్యక్షుడుగా బాబర్‌జాన్, ఉపాధ్యక్షులుగా ఖాజారహంతుల్లా, కాలేషా, ప్రధాన కార్యదర్శిగా ఖాజా మస్తాన్, కోశాధికారిగా మస్తాన్ సాహెబ్‌ను ఎన్నుకున్నారు. నెల్లూరు నగర అధ్యక్షుడిగా హుస్సేన్, ప్రధాన కార్యదర్శిగా హబీబ్, యూత్ అధ్యక్షుడిగా సుభాన్, యూత్ ప్రధాన కార్యదర్శిగా అక్బర్‌ను ఎన్నుకున్నారు. వారితో పాటు పలువురు జిల్లా కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు షేక్ ఖాదర్‌బాషా మాట్లాడుతూ జిల్లాలో నూర్‌బాషా దూదేకుల(బీసీ) సంక్షేమ సంఘాన్ని బలోపేతం చేసేందుకు కృషి చేయాలన్నారు. భారత్ సేవా ఫౌండేషన్ కార్యదర్శి షేక్ ఖాసీం మాట్లాడుతూ నూర్‌బాషాల సమస్యలను పరిష్కరించేందుకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని చెప్పారు. జాఫువా గ్రంథాలయ కమిటీ ఆధ్వర్యంలో పీ-4 విధానంలో ఆ గ్రంథాలయాన్ని అభివృద్ధి చేస్తున్నామన్నారు. ఏకగ్రీవంగా ఎన్నికైన నూర్‌బాషా సంఘ నాయకులకు పలువురు అభినందనలు తెలిపారు.



బాబర్‌జాన్‌ను అభినందిస్తున్న నాయకులు

మాదకద్రవ్య రహిత సమాజం రావాలి

- జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర నేత డాక్టర్ కాలేషా



సదస్సులో మాట్లాడుతున్న జేవీవీ నాయకుడు డాక్టర్ కాలేషా

నెల్లూరు(వైద్యం), ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి) : మాదకద్రవ్యాల రహిత సమాజం కోసం ప్రతీ ఒక్కరు పాటుపడాలని జేవీవీ రాష్ట్ర నాయకుడు డాక్టర్ కాలేషా తెలిపారు. ఆదివారం నెల్లూరు నగరంలోని డాక్టర్ జెట్టీ శేషారెడ్డి విజ్ఞాన కేంద్రంలో మాదకద్రవ్యాల రహిత సమాజం ఆవశ్యకతపై నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడుతూ నేటి సమాజంలో మాదకద్రవ్యాల వినియోగం సమాజంలో ఎక్కువగా ఉందన్నారు. యువత దీని భారిన పడి తమ భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారన్నారు. ఈ నేపథ్యంలో మాదకద్రవ్యాల భారీ నుంచి బయట పడేందుకు కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం జేవీవీ నెల్లూరు నగర నూతన కమిటీ ఎన్నిక జరిగింది. నగర గౌరవాధ్యక్షుడుగా డాక్టర్ ఎండి రఫీ, అధ్యక్ష, కార్యదర్శులుగా మోహన్‌రెడ్డి, సీహెచ్ కృష్ణ, కోశాధికారిగా కిశోర్, మరో 20 మందితో కమిటీని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో జేవీవీ జిల్లా కార్యదర్శి డాక్టర్ శ్రీను నాయక్, విజయకుమార్, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బల్కర్ ఢీకొని ఇద్దరికి తీవ్ర గాయాలు

ముత్తుకూరు, ఆగస్టు17 (ఆంధ్రజ్యోతి): బల్కర్ ఢీకొని ఇద్దరు యువకులు తీవ్రంగా గాయపడిన సంఘటన జెన్కో రహదారిపై ఆదివారం రాత్రి జరిగింది. స్థానికుల కథనం మేరకు వివరాలిలా వున్నాయి. జెన్కో థర్మల్ కేంద్రం నుంచి నెల్లూరు వెళ్తున్న బూడిద బల్కర్ ఆగి వున్న బైక్‌ను వేగంగా వచ్చి ఢీకొంది. దీంతో బైకుపై ఉన్న తాళ్లపూడికి చెందిన యువకులు అల్లంపాటి శేఖర్, దుంపల నవీన్ బైక్ తో సహా పక్కనే ఉన్న మరో బల్కర్ కింద పడ్డారు. తీవ్రంగా గాయపడ్డ వీరిద్దరినీ స్థానికులు చికిత్స నిమిత్తం నెల్లూరు వైద్యశాలకు తరలించారు. ప్రమాదానికి కారణమైన బల్కర్ డ్రైవర్ వాహనంతో సహా అక్కడినుంచి వెళ్లే ప్రయత్నం చేయగా, స్థానిక యువకులు వెంబడించారు. బల్కర్‌ను అడ్డుకుని ముత్తుకూరు పోలీసులకు సమాచారమిచ్చారు.

ఇద్దరు దొంగల అరెస్ట్

- మూడు బైక్‌ల స్వాధీనం



పట్టుకున్న నిందితులు, స్వాధీనం చేసుకున్న వాహనాలతో ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు

నెల్లూరు (క్రైం), ఆగస్టు 17 (ఆంధ్ర జ్యోతి): వరుస బైక్‌ల దొంగతనాలకు పాల్పడుతూ పోలీసుల కళ్లు గప్పి తిరుగుతున్న ఇద్దరు నిందితులను వేదాయపాలెం పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుల వివరాలను స్థానిక ఇన్‌స్పెక్టర్ కే.శ్రీనివాసరావు ఆదివారం వెల్లడించారు. పొదలకూరు రోడ్డు హెచ్‌ఆర్ కల్యాణ మండపం సమీపంలో తన బైక్‌ను గుర్తుతెలియని దుండగులు దోచుకెళ్లారని ఈనెల 9వ తేదీన తిరుపతి జిల్లాకు చెందిన మునిశంకర్ వేదాయపాలలెం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు తన సిబ్బందితో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి బైక్ దొంగతనాలపై ప్రత్యేక దృష్టి సారించారు. ఈ క్రమంలో ఆదివారం బుజబుజనెల్లూరు వద్ద జాతీయరహదారి పక్కన ఉన్న పాతమల్లారెడ్డి దాబా సమీపంలో అనుమానాస్పదంగా ఉన్న నెల్లూరు రూరల్ మండలం వైఎస్‌ఆర్‌నగర్‌కు చెందిన వీ.శ్రీకాంత్, మూలాపేట కసాయివీధికి చెందిన షేక్ ఖలీల్‌లను అదుపులోకి తీసుకుని విచారించారు. నిందితులు హెచ్‌ఆర్ కల్యాణ మండపం, బాలాజీనగర్, సంతపేట పోలీసు స్టేషన్‌ల పరిధిలో మూడు బైక్‌లను దొంగలించినట్లు విచారణలో వెల్లడించారు. నిందితులను అరెస్ట్ చేసి అపహరించిన మూడు బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అరెస్ట్ చేసిన ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు, ఎస్‌ఐ జీ.నవీన్‌కుమార్, పీఎస్‌ఐ యు సాయికళ్యాణ్, సిబ్బందిని డీఎస్పీ అభినందించారు.

గణేశ్వరాపురంలో ఇరువర్గాల ఘర్షణ

వరికుంటపాడు(ఉదయగిరి రూరల్), ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గణేశ్వరాపురంలో ఇరువర్గాల నడుమ చోటుచేసుకొన్న ఘర్షణతో గ్రామంలో ఉత్కంఠ పరిస్థితులు నెలకొన్నాయి. వివరాల మేరకు.. గ్రామంలో నిర్వహిస్తున్న ప్రభుత్వ వాటర్ ప్లాంటు నుంచి కలుషిత తాగునీరు వస్తోందని శనివారం అదే గ్రామానికి చెందిన బాదం మాధవరెడ్డి అనే వ్యక్తి నిర్వాహకులు బోనముక్కల నాగేశ్వరరావును ప్రశ్నించాడు. ఈనేపథ్యంలో ఇరువురి నడుమ వాగ్వివాదం చోటుచేసుకుంది. అనంతరం అక్కడినుంచి వెనుతిరిగి వెళ్తున్న మాధవరెడ్డిపై మార్గమధ్యంలో నాగేశ్వరరావు కుమారుడు భాస్కర్‌రెడ్డి దాడికి పాల్పడ్డారు. ఆ సమయంలో సమీపంలోని నివాసంలో ఉన్న సింగంరెడ్డి వీరేంద్ర అనే వ్యక్తి తన సెల్‌ఫోన్‌లో వీడియో తీశాడు. విషయం తెలుసుకున్న నాగేశ్వరరావు వర్గీయులు ఆదివారం పథకం ప్రకారం వీరేంద్రను సైతం అడ్డుకొని దాడికి పాల్పడడంతో ఇరు వర్గీయుల నడుమ ఘర్షణ నెలకొంది. ఈ నేపథ్యంలో గాయపడిన వీరేంద్రను చికిత్స నిమిత్తం 108 వాహనంలో ఆత్మకూరుకు తరలించారు. ఈ విషయమై ఇరు వర్గీయులు పోలీసులకు ఫిర్యాదులు చేశారు.

జంప్ రోప్ క్రీడలో విద్యార్థుల ప్రతిభ

వింజమూరు/సీతారామపురం, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పాతూరుకి చెందిన జిల్లెల శ్రీనివాసులు, మహేశ్వరి కుమార్తె వెంకటహర్షిణి జాతీయ స్థాయిలో జంప్ రోప్ క్రీడలో రాణిస్తోంది. ఈ విద్యార్థి ఏడో తరగతిలో జోడో గేమ్‌లో పాల్గొని దాని నుంచి జంప్ రోప్ క్రీడను ఎంచుకుని మొదట నెల్లూరు నుంచి థాయిలాండ్ వరకు జైత్రయాత్రను కొనసాగిస్తోంది. మొదట మదనపల్లెలో మొదలుపెట్టి, కర్నూలు, ఆర్లగడ్డ, తెనాలి, బద్వేల్, కర్రేడు, షిరిడీ నగరాల్లో క్రీడల్లో పాల్గొని 7 గోల్డ్‌మెడల్స్ 3 సిల్వర్ మెడల్స్, ఒక కాంశ్య పతకాన్ని సాధించింది. థాయిలాండ్‌లోని బ్యాంకాంగ్ నగరంలో జరిగిన నేషనల్ క్రీడల్లో పాల్గొంది. కాగా, ఈ క్రీడాకారిణికి ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి చారిటబుల్ ట్రస్ట్ వారు రూ.లక్ష, ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ట్రస్ట్ వారు రూ.25వేలు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి మన్నేటి వెంకటరెడ్డి రూ.20 వేలు, కాపు సంఘం రూ.46వేలు, అనపురెడ్డి మురళీధర్‌రెడ్డి రూ.10వేలు ఆర్థిక సహాయం అందజేశారు. ప్రస్తుతం ఈ విద్యార్థిని స్వర్ణభారత్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అక్షర విద్యాల యంలో పదో తరగతి కొనసాగిస్తోంది. నేషనల్ ఛాంపియన్‌షిప్‌ను సాధించాలని తన ఆశాభావాన్ని వ్యక్తం చేసింది.



జాతీయ స్థాయి అవార్డు అందుకుంటున్న వెంకట హర్షిణి

● కావలిలోని డిబి ఎస్ కాలేజీలో జరిగిన 6వ సబ్ జూనియర్ ఇంటర్ డిస్ట్రిక్ట్ జంప్ రోప్ ఛాంపియన్ షిప్ పోటీల్లో స్థానిక వేద గర్భ ఇంగ్లీష్ మీడియం పాఠశాలకు చెందిన విద్యార్థులు గోల్డ్ మెడల్ సాధించారు. సంతోష్ అనే విద్యార్థి సైక్లింగ్ ఈవెంట్లో, వివిన్ అనే విద్యార్థి ఫ్రీ స్టైల్ ఈవెంట్లో ప్రతిభ చూపి గోల్డ్ మెడల్ దక్కించుకుని, సెప్టెంబర్‌లో మహారాష్ట్రలో జరిగే జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	123
స్కిన్ చికెన్	224
స్కిన్‌లెస్	250

కోడిగుడ్ల ధర (100): 520

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ.9553
వెండి కిలో ధర	రూ. 117500
వెండి ఒక గ్రాము	రూ.120.50

నేడు ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి పర్యటన

అల్లూరు, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): పలు ఆలయాల పాలక మండలి ఎంపికల్లో పాల్గొనేందుకు కావలి ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి సోమవారం అల్లూరు మండలంలో పర్యటించనున్నారు. నార్తుమోపూరు రామాలయం, శివాలయం, వరదరాజస్వామి ఆలయం, ఇందుపూరులోని వెంకటేశ్వరస్వామి ఆలయ పాలక మండలి ఎంపిక కార్యక్రమాల్లో ఆయన పాల్గొననున్నారు. ఉదయం 9.30 గంటలకు నార్తుమోపూరులో, అనంతరం ఇందుపూరులో పర్యటిస్తారని తెలుగుదేశం పార్టీ నాయకులు తెలిపారు.

క్యాన్సర్ బాధితుడికి ఆర్థికసాయం

కావలి,ఆగస్టు17(ఆంధ్రజ్యోతి): కావలి పట్టణం 8వ వార్డుకు చెందిన క్యాన్సర్ బాధితుడు జలదంకి శివకుమార్‌కు ఆదివారం ఆర్యవైశ్య ప్రముఖులు రూ.50 వేలు ఆర్థిక సహాయం అందచేశారు. కన్యకాపరమేశ్వరి దేవస్థాన కమిటీ ఉపాధ్యక్షుడు అమరా వేదగిరి ఆధ్వర్యంలో ఆర్యవైశ్య ప్రముఖులు, మిత్రుల నుంచి రూ. 45 వేలు సేకరించారు. వాటిని అందచేయటానికి ఆర్యవైశ్యసంఘం కావలి అధ్యక్షుడు తటవర్తి రమేష్‌ను ఆహ్వానించటంతో ఆయన మరో రూ.5 వేలు ఇవ్వటంతో మొత్తం రూ. 50 వేలు శివకుమార్ ఇంటికి వెళ్లి అందచేశారు.

పంచాయతీరాజ్ ఉద్యోగికి సన్మానం

కావలి, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): కావలి పట్టణానికి చెందిన చింతాల భాస్కరరావు పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ శాఖలో సాంకేతిక విభాగంలో పనిచేసి పదవీ విరమణ చేయడంతో ఆదివారం కావలి పట్టణ కల్యాణ మండపంలో ఆయన్ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి పాల్గొని ఆయన సేవలను కొనియాడారు. అలాగే పంచాయతీరాజ్ అధికారులు, ఉద్యోగులు తదితరులు ఆయనను సన్మానించారు.

పోలేరమ్మకు పొంగళ్లు

కొండాపురం, ఆగస్టు17(ఆంధ్రజ్యోతి): మండలంలోని సాయిపేట పంచాయతీలోని వెల్లటూరివారిపాలెంలో ఉన్న పోలేరమ్మకు భక్తులు ఆదివారం పొంగళ్ల కార్యక్రమం నిర్వహించారు. పంచాయతీలోని మక్కెనవారిపాలెం, వెల్లటూరివారిపాలెం, ఇస్కపాలెం గ్రామాల భక్తులు భక్తి శ్రద్ధలతో అమ్మవారికి పొంగళ్లుపెట్టి పూజలు చేశారు.

శ్రీహరికోట తీరంలో

బోటు కలకలం

- బోగోలు మండలం జువ్వలదిన్నె వాసిగా గుర్తింపు
- విచారణానంతరం పంపేసిన పోలీసులు

సూళ్లూరుపేట, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): శ్రీహరికోట సముద్ర తీరం ఒడ్డున ఓ పడవ ప్రత్యక్షమవడంతో కలకలం రేగింది. శ్రీహరికోట పోలీసుల సమాచారం మేరకు.. ఆదివారం తెల్లవారుజామున షార్‌లోని సముద్ర ఒడ్డున పడవతో ఓ వ్యక్తి తిరుగుతుండడంతో బందోబస్తులో ఉన్న సీఐఎస్‌ఎఫ్ సిబ్బంది గుర్తించారు. బోటుతో పాటు అతడిని అదుపులోకి తీసుకుని విచారించారు. అనంతరం శ్రీహరికోట పోలీసులకు అప్పగించారు. పోలీసుల విచారణలో.. అతడు నెల్లూరు జిల్లా బోగోలు మండలం జువ్వలదిన్నె గ్రామానికి చెందిన సీహెచ్ శ్రీనివాసులు అనే మత్స్యకారుడని తేలింది. చెన్నై వెళ్లి సముద్రంలో చేపల వేట చేసే బోటును కొనుగోలు చేశారు. ఆ బోటును తీసుకుని చెన్నై నుంచి సముద్ర తీరానే శ్రీహరికోట మీదుగా కావలికి వెళుతున్నాడు. సరిగ్గా షార్ వద్దకు వచ్చేసరిగా బోటులో మోటారు మొరాయించింది. చేసేదేమి బోటును సముద్రం ఒడ్డుకు తీసుకొచ్చాడు. సమీపంలో విధుల్లో ఉన్న సీఐఎస్‌ఎఫ్ సిబ్బంది అనుమానంతో బోటు యజమాని శ్రీనివాసులును అదుపులోకి తీసుకున్నట్లు తేలింది. జువ్వలదిన్నెవాసిగా తేలడంతో, అక్కడి పోలీసులకు సమాచారం ఇచ్చి పూర్తి వివరాలు తెలుసుకున్నాక బోటు యజమానిని పంపించేశారు.

నాలుగు సచివాలయాలకు ఒక్కరే!

ఉద్యానవన సహాయకుల కొరత ● గత ఏడాది క్రాప్ బుకింగ్ సరిగా చేయలేదని సిబ్బంది కుదింపు ● రైతుల ఇబ్బందులు

లింగసముద్రం, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ముత్యాలపాడు క్లస్టరు పరిధిలోని ముత్యాలపాడు, పెదపవని, చినపవని, అన్నెబోయినపల్లి గ్రామ సచివాలయాలకు ఒక్కరే గ్రామ ఉద్యానవన సహాయకులు (విహెచ్ఏ) ఉండడం తో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గతంలో ఈ నాలుగు సచివాలయాలకు నలుగు రు గ్రామ వ్యవసాయ సహాయకులు ఉండేవారు. అయితే రాష్ట్ర ప్రభుత్వం సచివాలయాలను క్లస్టర్ పద్ధతిలో విభజించి, ఈ నాలుగు సచివాలయాల ను ఒక క్లస్టర్‌గా ఏర్పాటు చేసింది. పెదపవని సచివాలయానికి ఒక్కరినే ఉద్యానవన సహాయకు డిగా నియమించారు. దీంతో ఆయన అటు వ్యవ సాయానికి సంబంధించిన సేవలతో పాటు ఉద్యా నవన పంటలు సాగు చేసే రైతులకు సేవలు అందించాల్సి ఉంది. ఈ కారణంగా పెదపవని సచివాలయంతో పాటు మిగిలిన మూడు సచివాల యాల పరిధిలోని రైతులకు సేవలు అందించాలి. అంతేగాక ప్రభుత్వం రైతులకు అందించే పథకాల ను కూడా రైతులకు అందేలా చర్యలు చేపట్టాల్సి ఉంది. అంతేగాక ఈ పంట నమోదు, పంటల బీమా తదితర పనులు కూడా చేయాల్సి ఉంది. అన్నదాత-సుఖీభవ,



పీఎం కిసాన్ మొదలైన పథకాలకు సం బంధించి రైతులకు సేవలు అందించాల్సి ఉంది. ఒక్కరే అన్ని సచివాలయాలకు విధులు నిర్వహించాల్సి రావడంతో ఆయన రైతులకు అందుబాటులో ఉండలేక పోతున్నారు. ప్రస్తుతం అన్నదాత సుఖీ భవ, పీఎం కిసాన్ నిధులు రాని రైతులు ఉద్యానవ న సహాయకుడు ఏ సచివాలయంలో ఉంటారో తెలియక సచివాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తు న్నారు. దీంతో ఈ నాలుగు రైతు సేవా కేంద్రాలలో మూడు రైతు సేవా కేంద్రాల తలుపులు ఎప్పుడూ తెరుచుకోవు. అయితే ఆయన వచ్చిన రోజు మాత్రం తెరుచుకుంటాయి. అయితే గత ఏడాది ఈ నాలు గు సచివాలయాల పరిధిలో వీఏఏల కొరత కార ణంగా రైతులు సాగు చేసిన పంటలను ఈ-క్రాప్ లో సరిగా నమోదు చేయలేదు. దీంతో ఆన్‌లైన్‌లో ఈ-పంట నమోదు చేసిన భూములు తక్కువగా ఉండడంతో రాష్ట్ర వ్యవసాయశాఖ ఉన్నతాధికారులు రెండు పోస్టులను తొలగించినట్టు తెలిసింది. దీంతో రైతులకు అందాల్సిన సేవలు సక్రమంగా అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటి కైనా ఉన్నతాధికారులు స్పందించి రైతుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని వీఏఏలను నియమించాలని వారు కోరుతున్నారు.

మహిళలకు ఉచిత ప్రయాణంతో

ఆర్టీసీ బస్సులు కిటకిట



కావలి, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం స్త్రీశక్తి పథకం లో భాగంగా ఆర్టీసీ బస్సు లలో మహిళలకు ఉచిత ప్రయాణం చేసేందుకు అవకాశం కల్పించింది. దీంతో మహిళలతో బస్సులు కిటకిటలాడుతు న్నాయి. సహజంగా ఆదివారం గ్రామీణ బస్సులలో పెద్దగా రద్దీ ఉండదు. అయితే ఉచిత ప్రయాణం కావటంతో ఆదివారం కూడా కావలి ఆర్టీసీ డిపోలో సింగరాయకొండ వైపు వెళుతున్న పల్లెవెలుగు బస్సులో ఎక్కేందుకు మహిళలు తొక్కిసలాడుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.

చిన్నారులకు నిత్యావసరాల వితరణ

కావలి(టౌన్)ఆగస్టు17(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వెంగళరావునగర్‌లోని సంయుక్త సేవా సంస్థ కార్యాలయంలో సంస్థ సంరక్షణలోని చిన్నారులకు నెలకు సరిపడా నిత్యావసరాలు వితరణ చేశారు. సంస్థ అధ్యక్షుడు సురేంద్ర అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థల గౌరవాధ్యక్షుడు ఖాదర్‌బాష, రత్నమ్మ ఫౌండేషన్ చైర్మన్ ప్రసాదరావులు పాల్గొని నిత్యావసరాలు, పోస్ట్ ఆఫీస్‌లో ప్రతినెలా జమ చేస్తున్న పాస్ పుస్తకాలు అందించారు. సంస్థ అధ్యక్షుడు సురేంద్ర మాట్లాడుతూ అనాథ, నిరాదరణ పిల్లలను దాతలు దత్తత తీసుకుని సంయుక్త సంస్థ సంరక్షణలో వారిని ఉంచి ప్రతినెలా వారికి అవసరమైన నిత్యావసరాలు పిల్లల భవిష్యత్ అవసరాలకు ప్రతినెలా వారి పేరిట పోస్ట్ ఆఫీస్‌లో రూ,1000 జమ చేస్తున్నారని దాతలందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

జలవిద్యుత్ తయారీ ప్రక్రియ అద్భుతం

కందుకూరు, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): ప్రకాశం ఇంజనీరింగ్ కళాశాల ఎలక్ట్రికల్ విభాగం విద్యార్థులు క్షేత్ర పరిశీలనలో భాగంగా శ్రీశైలం జలవిద్యుత్ కేంద్రాన్ని ఆదివారం సందర్శించారు. విద్యుత్ ఉత్పత్తి తీరును పరిశీలించారు. కళాశాలలో నిర్వహించిన సమావేశంలో విద్యార్థులు తమ అనుభవాలను సహచర విద్యార్థులు, అధ్యాపకులతో పంచుకున్నారు. శ్రీశైలం హైడల్ ప్లాంట్ డీఈఈ చంద్రశేఖర్ విద్యుత్ ప్రక్రియను, అక్కడి యంత్రపరికరాల పనితీరును తమకు వివ రించారని తెలిపారు. కరస్పాండెంట్ కంచర్ల విజయ్‌శ్రీనివాస్ మా ట్లాడుతూ థియరీతో పాటు ప్రాక్టికల్ నాలెడ్జ్ పెంపొందిస్తేనే విద్యా ర్థులు లక్ష్యసాధనలో విజయవంతమ వుతారని, అందుకే క్షేత్రప ర్యటనలకు రూపకల్పన చేస్తున్నట్లు తెలిపారు. ప్రిన్సిపాల్ సీహెచ్ రవికుమార్, వైస్ ప్రిన్సిపాల్ వి. హరిబాబు, అకడమిక్ ఇన్‌ఛార్జి ఎస్ఎన్ మీరావలి తదితరులు పాల్గొన్నారు.

'దళితులపై దాడులు అమానుషం'

బిట్రగుంట, (ఆంధ్రజ్యోతి): బోగోలు మండలంలో దళితులపై దాడి చేయడం అమానుషమని ఎస్సీ, ఎస్టీ జేఏసీ జిల్లా గౌరవ అధ్యక్షుడు జ్యోతి సోముశేఖర్ వరప్రసాద్ అన్నారు. బోగోలు బజారు కూడలిలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద దళితుల ఆత్మ గౌరవ సమావేశం ఆదివారం నిర్వహించారు. దళిత నేతలు దాసరి బాబురావు, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కమిటీ సభ్యుడు కొప్పోలు రఘు, అంబేడ్కర్ యువజన సంఘ రాష్ట్ర అధ్యక్షుడు ఎల్లు సాల్మన్‌రాజు, జువిగుంట బాబు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. తొలుత అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.

బోగోలులో చిరుజల్లులు

బిట్రగుంట, (ఆంధ్రజ్యోతి): బోగోలు మండలంలో ఆదివారం తెల్లవారుజాము నుంచి చిరు జల్లులు కురుస్తున్నాయి. బంగాళాఖాతంలో అల్పపీడనం కారణంగా వాతావరణంలో మార్పులు వచ్చాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మండల తహసీల్దారు సానా శ్రీనివాసరెడ్డి తెలిపారు.

కల్వర్టుపై రంధ్రం పూడ్చివేత



కావలి, ఆగస్టు17(ఆంధ్రజ్యోతి): కావలి పట్టణం పాతూరులోని అక్కమ్మ బావిసెంటర్ సమీపంలో పంటకాలువ వద్ద నాలుగు రోడ్ల కూడలిలో కల్వర్ట్‌పై పడిన పెద్ద రంధ్రాన్ని మున్సిపల్ అధికారులు పూడ్చారు. కల్వర్ట్‌పై రంధ్రం - పొంచి ఉన్న ప్రమాదం అనే శీర్షికతో శుక్రవారం ఆంధ్రజ్యోతిలో వార్త ప్రచురితమైంది. దీనిపై స్పందించిన మున్సిపల్ అధికారులు ఆ రంధ్రాన్ని కాంక్రీట్‌తో పూడ్చి అక్కడ ప్రమాదాలు జరుగకుండా మరలా రంధ్రం పడకుండా చర్యలు చేపట్టారు. దీంతో ఆ ప్రాంత ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

తోట వెంకటేశ్వర్లుకు సేవారత్న పురస్కారం



పురస్కారమందుకుంటున్న తోట వెంకటేశ్వర్లు

కావలి(టౌన్) ఆగస్టు17(ఆంధ్రజ్యోతి) : జనవిజ్ఞాన వేదిక కావలి అధ్యక్షుడు, టీవీఎస్ ట్రస్ట్ చైర్మన్ తోట వెంకటేశ్వర్లు చంద్రన్న సేవారత్న పురస్కారం అందుకున్నారు. ఆయన వివిధ రంగాల్లో విశిష్ట సేవలందిస్తున్నందుకు గాను ఆదివారం నెల్లూరు టౌన్ హాల్‌లో ధర్మచక్ర సినిమా దర్శక నిర్మాతైన టి వెంకటరమణ సేవారత్న పురస్కారంతో సత్కరించారు. తోట వెంకటేశ్వర్లు మాట్లాడుతూ తన సేవలను గుర్తించి సేవారత్న పురస్కారమందించడం సంతోషంగా ఉందన్నారు.

సుందర సమాజ స్థాపనపై చర్చాగోష్ఠి



ముసునూరు బిలాల్ మసీదులో సమావేశమైన వివిధ మతస్థులు

కావలి(టౌన్)ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): జమాతే ఇస్లామీ హింద్ ఆధ్వర్యంలో ఆదివారం ముసునూరులోని ముస్లింపాలెంలోని బిలాల్ మసీదులో సుందర సమాజ స్థాపనపై చర్చాగోష్ఠి కార్యక్రమం జరిగింది. జమాతే ఇస్లామీ హింద్ సభ్యులు సయ్యద్ జిలాని బాషా పర్యవేక్షణలో జరిగిన కార్యక్రమంలో వివిధ మతాలకు చెందిన చెన్నా వెంకట రమణయ్య, శారద, లలితా, సుకన్య, ఏసుపా దం, రవి, సాయి, దేవ తదితరులు పాల్గొని సుందర సమాజ స్థాపన గురించి మాట్లాడారు. తల్లితండ్రులు పిల్లలను బాధ్యతగా పెంచాలని, విద్యాసంస్థల్లో నైతిక విలువలతో కూడిన విద్యనందించాలన్నారు. జమాతే ముస్లిం హింద్ స భ్యులు మొహమ్మద్ ముస్లిం, చాంద్‌బాష, ఆబిద్, మహబూబ్‌బాష, నూర్జహాన్, ఫాతిమ, తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించకుంటే ఆందోళన



సమావేశంలో మాట్లాడుతున్న రెహనాబేగం

ఉదయగిరి, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీలు దీర్ఘకాలికంగా ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్క రించకుంటే ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి షేక్ రెహనాబేగం పేర్కొన్నారు. ఆదివారం స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య భవనంలో అంగ న్‌వాడీ కార్యకర్తలు, ఆయాలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. అనంతరం ఆమె విలేఖరులతో మాట్లాడుతూ తాము అధికారంలోకి వస్తే సమస్యలన్నింటిని పరిష్కరిస్తామని చెప్పిన సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్‌లు మాట తప్పారని అధికారం చేపట్టి ఏడాది దాటినా ఇంతవరకు సమస్యలు పరిష్కరించలేదన్నారు. ఇచ్చిన ఫోన్‌లు పనిచేయక కార్యకర్తలు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. అందులో భాగంగా ఈనెల 4న జిల్లావ్యాప్తంగా అంగన్‌వాడీలు తమ ఫోన్‌లను సీడీపీవో కార్యాలయాలకు అప్పగించారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం అంగన్‌వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి పదోన్నతులు కల్పించడంతోపాటు కనీసం వేతనం రూ.26 వేలు చెల్లించాలని, 5జీ ఫోన్‌లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేదంటే దశలవారీగా ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు కాకు వెంకటయ్య, కోడె రమణయ్య, రజియా, నాయబ్, వెంకటేశ్వర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు తదితరులు పాల్గొన్నారు.


వర్షంతో మెట్ట పైర్లకు మేలు

ఉదయగిరి రూరల్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): అల్పపీడన ప్రభావంతో ఉదయగిరి, వరికుంటపాడు మండలాల్లోని పలు గ్రామాల్లో ఆదివారం ఓ మోస్తరు వర్షం కురిసింది. మెట్ట పంటలకు వర్షం సానుకూలంగా మారుతుందని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం కోతకు వచ్చిన వేరుశనగ రైతులు మాత్రం పంట నష్టపోవాల్సి వస్తుందేమోనని భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. పలు గ్రామాల్లో రహదారులు, నివాసాల సముదాయాల్లో వర్షపు నీరు నిలిచిపోవడంతో రాకపోకలకు ప్రజలు ఇబ్బందులకు గురయ్యారు.

నేడు వేంకటేశ్వరుడి కల్యాణం

మర్రిపాడు, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): మాజీ ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి, శాంతికుమారి దంపతుల ఆధ్వర్యంలో వారి నివాస ప్రాంగణంలో సోమవారం ఉదయం శ్రీదేవి, భూదేవి వేంకటేశ్వరస్వామి కల్యాణం వైభవంగా నిర్వహించనున్నారు. ఈ కల్యాణానికి ఆత్మకూరు, ఉదయగిరి పరిసర ప్రాంతాల నుంచి భక్తులు తరలిరావాలని కోరారు.

విద్యార్థులకు ఉపకార వేతన మంజూరు పత్రాల పంపిణీ



విద్యార్థికి ఉపకార వేతన మంజూరు పత్రం అందజేస్తున్న చంద్రమౌళీశ్వరరెడ్డి

దుత్తలూరు(ఉదయగిరి), ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): చదువుకునే రోజుల్లో తనకు అందిన ఆర్థిక చేయూత వల్లే తాను ఈస్థాయికి ఎదిగానని విశ్రాంత ఐఏఎస్ అధికారి రామిరెడ్డి చంద్రమౌళీశ్వరరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం స్థానిక సీడ్స్ స్వచ్ఛంద సంస్థలో జిల్లాలో వివిధ ప్రాంతాలకు చెంది 10వ తరగతిలో ప్రతిభ చాటి ఆర్థికంగా వెనుకబడిన 96 మంది విద్యార్థులకు సీడ్స్ యువ ఆన్‌స్టాపబుల్ సంస్థలు సంయుక్తంగా ఉపకార వేతనాల మంజూరు పత్రాలను విద్యార్థులకు అందజేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యలో రాణిస్తూ ఆర్థిక ఇబ్బందుల కారణంగా చదువుకు దూరం కాకూడదనే ఉద్దేశంతోనే ఈ ఉపకార వేతనాలు అంజేస్తున్నామన్నారు. అందులో భాగంగానే సీడ్స్ స్వచ్ఛంద సంస్థ స్థాపించి వివిధ వర్గాల వారికి సేవలం దిస్తున్నామన్నారు. అనంతరం పలువురు వక్తలు మాట్లాడుతూ సీడ్స్ స్వచ్ఛంద సంస్థ ఏర్పాటు చేసి రైతులు, విద్యార్థులు, నిరుద్యోగులకు అందిస్తున్న సేవలు అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో సబితారెడ్డి, రైతు సాధికార సంస్థ రీజనల్ టెక్నికల్ కోఆర్డినేటర్ రవిచంద్ర, విశ్రాంత శాస్త్రవేత్త రామిరెడ్డి మల్లికార్జున్‌రెడ్డి, ఎంఈవో వెంగయ్య, విశ్రాంత ఎంపీడీవో జహీర్, సీడ్స్ సంస్థ సీఈవో పురుషోత్తం, సిబ్బంది వేణుగోపాల్, రసూల్, విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.


వర్షాలు లేక నీటివనరులు వెలవెల

● ఆందోళనలో అన్నదాతలు

ఉదయగిరి, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): వర్షాలు లేక నీటి వనరులు వెలవెల బోతున్నాయి. దీంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. నియోజకవర్గంలోని ఎనిమిది మండలాల్లో సుమారు 250 చెరువులు ఉండగా వాటి కింద 45 వేల హెక్టార్ల ఆయకట్టు ఉంది. అలాగే గండిపాళెం, మర్రివూట్ల, నక్కలగండి రిజర్వా యర్ల కింద 22వేల ఎకరాల ఆయకట్టు ఉంది. ఆశాజనకంగా వర్షాలు కురవకపోవడంతో నీటి వనరులన్నీ నీరులేక వెలవెలబోతున్నాయి. జలాశయాల్లో నీటిమట్టం డెడ్‌స్టోరేజీలో ఉంది. దీంతో చెరువు, జలాశయాల ఆయకట్టు భూములు కొన్ని ప్రాంతాల్లో చిట్టడవిని తలపిస్తున్నాయి. కొన్ని గ్రామాల్లో బోర్ల కింద రైతులు అరకొరగా వరి, జొన్న, మొక్కజొన్న, సజ్జ తదితర పంటలు సాగు చేసి ఉన్నారు. అరకొరగా కురుస్తున్న చిరుజల్లులకు ప్రస్తుతం పంటలు పచ్చగా ఉన్నా చేతికందుతాయో లేదోనన్న ఆందోళన కర్షకుల్లో నెలకొంది. వరుణుడు కరుణించి నీటి వన రులకు పుష్కలంగా నీరు చేరితే పంటల సాగు విస్తీర్ణం పెరిగే అవకాశముంది.

చిరుజల్లులకే పరిమితం

రాష్ట్రంలో ఎక్కడ చూసినా విస్తారంగా వర్షాలు కురుస్తూ నీటి వనరులు జలకళతో కళకళ లాడుతున్నాయి. అయితే మెట్ట ప్రాంతమైన ఉదయగిరి నియోజకవర్గంపై మాత్రం వరుణుడు కరుణ చూపడంలేదు. గత పక్షం రోజులుగా ఆకాశం మేఘావృతమై ఉన్నా చిరుజల్లులకే పరిమితమవుతోంది. ఖరీఫ్ సీజన్ ప్రారంభమై 80 రోజులు కావస్తున్నా సరైన వర్షపాతం నమోదు కాలేదు. దీంతో బంగారం పండే భూములు బీళ్లుగా ఉన్నాయి. అరకొరగా బోర్ల కింద సాగుచేసిన రైతుల పరిస్థితి దయనీయంగా మారింది. ముఖ్యంగా వర్షాధారంపై ఆధారపడిన ప్రాంతాల్లో నిరాశజనకంగా కనిపిస్తోంది. ఆశించిన మేర వర్షాలు కురవక జలాశయాలు, చెరువులు, నీటికుంటలు చుక్కనీరు లేక వెలవెలబోతున్నాయి. ఈ ఏడాది కూడా ఖరీఫ్ సీజన్ కలిసొచ్చేలా లేదని పలువురు రైతులు అంటున్నారు.



డెడ్‌స్టోరేజీలో ఉన్న గండిపాళెం జలాశయం నీటిమట్టం

మృతుడి కుటుంబానికి ఆర్థికసాయం

ఉదయగిరి, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని గండిపాళెం ఎస్సీ కాలనీకి చెందిన యాసారపు దేవయ్య ఇటీవల గుండెపోటుతో మృతిచెందడంతో విషయం తెలుసుకున్న ఐటీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి రెడ్డిబత్తిన ఉమాసాయిరాం ఆదివారం తన ప్రతినిధులచే ఆ కుటుంబానికి రూ.5 వేలు ఆర్థికసాయం అందజేశారు. దేవయ్య కుటుంబ పరిస్థితిని ఎమ్మెల్యే కాకర్ల సురేష్ దృష్టికి తీసుకెళ్లి ఆర్థికంగా ఆదుకునేలా చర్యలు చేపడతామని వారు కుటుంబ సభ్యులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ, జనసేన నాయకులు ఇమ్రాన్, భాస్కర్, సునీల్, నవీన్ పాల్గొన్నారు.

పందుల స్వైర విహారంతో గ్రామస్థుల బెంబేలు

ఏఎస్ పేట, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): యాత్రస్థలంగా దేశవ్యాప్తంగా పేరుపొందిన ఏఎస్‌పేటలో పందుల స్వైర విహారంతో గ్రామస్థులు, యాత్రికులు బెంబేలెత్తుతున్నారు. పలు రాష్ట్రాల నుంచి విచ్చేసిన భక్తులు గ్రామంలో తిరగడానికి ఇబ్బందులు పడుతున్నారు. పందులు గుంపులు గుంపులుగా సంచరిస్తూ ఒక్కసారిగా జనాల మధ్యలోకి దుసుకురావడంతో భయాందోళనకు గురవుతున్నారు. పలువురిపై దాడి చేసి గాయపరిచిన సంఘటనలు ఉన్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి పందులను గ్రామం నుంచి తొలగించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

అధ్వానంగా జలాశయ కాలువలు



అధ్వానంగా మారిన పంట కాలువ

ఉదయగిరి రూరల్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గండిపాళెం జలాశయం ఆయకట్టు రైతుల పరిస్థితి ఆగమ్యగోచరంగా మారింది. కూతవేటు దూరంలో జలాశయం ఉన్నా సాగునీరు మాత్రం అందని ద్రాక్షాగానే ఊరిస్తోంది. ఏళ్లతరబడి ఇలాంటి తంతే కొనసాగుతుండడంతో ఉదయగిరి, వరికుంటపాడు మండలాల రైతులు అయోమయంలో కొట్టుమిట్టాడుతున్నారు. ఈ జలాశయం పరిధిలో మొత్తం 16వేల ఎకరాలకు సాగునీరు అందించాల్సి ఉండగా పూర్తిస్థాయి ఆయుకట్టుకు నీరందడం కలగానే మిగులుతోంది. ప్రధాన కాలువలతో పాటు లింకు కాలువలు సైతం అధ్వాన్నంగా మారడంతో సాగునీరు ముందుకు సాగే పరిస్థితి లేకుండా పోతోంది. రాళ్లు, రప్పలతో పూడి పోవడంతో సహా కంపచెట్లు మొలవడంతో ఈ పరిస్థితి దాపురించింది. దీంతో పలు గ్రామాల చెరువులకు కూడా నీరందే పరిస్థితి లేకుండా పోయింది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు దృష్టి సారించి కాలువలకు మరమ్మతులు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

రహదారిపై మురుగుతో పాదచారుల అవస్థలు



రహదారి పై పారుతున్న మురుగునీరు

ఉదయగిరి, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని దిలావర్‌భాయ్‌వీధిలో మురుగు కాలువ పూడికతో నిండి రోడ్డుపై నీరు ప్రవహిస్తుండడంతో పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు. మురుగు కాలువ వెడల్పు తక్కువగా ఉండడం, చెత్తాచెదారం అడ్డుపడడంతో రహదారిపైనే మురుగు ప్రవహిస్తోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతోపాటు రోడ్డుపైనే చెత్తాచెదారం చేరడంతో దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నామని, ఇప్పటికైనా అధికారులు స్పందించి కాలువలో పూడిక తీసి మురుగు నీరు సజావుగా వెళ్లేలా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

నాగారపమ్మకు ప్రత్యేక పూజలు



నాగారపమ్మను దర్శించుకుంటున్న భక్తులు

సంగం, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోలగట్ల పెన్నానది ఒడ్డున ఉన్న పురాతన నాగారపమ్మదేవి ఆలయంలో శ్రావణ మాసం నాల్గవ ఆదివారం పురస్కరించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా పెన్నానది జలాలు, క్షీర, సకల ద్రవ్య, పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించి పూలతో అలంకరించారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన మహిళా భక్తులు పొంగళ్లు పొంగించి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయంలో మధ్యా హ్నాం భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

భక్తిశ్రద్ధలతో గంగమ్మకు కుంకుమార్చన



గంగమ్మ కుంకుమార్చన పూజల్లో పాల్గొన్న మహిళలు

సంగం, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక పెన్నానది ఒడ్డున ఉన్న పాలేటి గంగమ్మ ఆలయంలో శ్రావణ మాసం పురస్కరించుకుని ఆదివారం అమ్మవారికి కుంకుమార్చన భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈసందర్భంగా గంగమ్మకు అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వేదపండితుల మంత్రోచ్చరణల నడుమ మహిళలు కుంకుమార్చన పూజలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.





బాబోయ్.. తిరుమల!





ఎడతెగని రద్దీ.. చిటపటమని కురుస్తూనే ఉన్న వాన.. వణికిస్తున్న చలి.. తిరుమలలో, తిరుపతిలో ఆదివారం చిత్రమైన వాతావరణం నెలకొంది. అలిపిరి కొండలమీద పచ్చని చెట్లతో ముచ్చట్లాడుతున్నట్టుగా తెల్లని మబ్బులు వాలి కనువిందు చేశాయి. టోల్‌గేట్‌లో బారులు తీరిన వాహనాలు భక్తులను ఇక్కట్లపాలు చేశాయి. తిరుమల కొండమీదా వరుస సెలవుల మూడో రోజున కూడా ఎటు చూసినా భక్తజనమే కిటకిటలాడుతూ కనిపించారు. కిలోమీటర్ల దూరం సర్వదర్శనం భక్తులు క్యూలైన్లలో నిలబడ్డారు. గదులు దొరక్క తల తడవని తావుల్లో సర్దుకుని కూర్చున్నారు. ఆలయం ముందు చలికి వణుకుతూ తిరుగుతూ కనిపించారు.

- ఆంధ్రజ్యోతి, తిరుమల, తిరుపతి



హోటల్ మేనేజ్మెంట్ కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి అర్బన్, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర పర్యాటక శాఖలు సంయుక్తంగా తిరుపతిలో నిర్వహిస్తున్న స్టేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంట్ క్యాటరింగ్ టెక్నాలజీ, అప్లైడ్ న్యూట్రిషియన్‌లో 2025-26 సంవత్సరానికి వివిధ కోర్సులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఏపీ టూరిజం అథారిటీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ఆమ్రపాలి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

- బీఎస్సీ (హెచ్ అండ్ హెచ్.ఏ) 3 సంవత్సరాల డిగ్రీ కోర్సుకు ఇంటర్‌లో 40శాతం పైబడి మార్కులు సాధించిన విద్యార్థులు అర్హులు.
- క్రాఫ్ట్ కోర్సు ఇన్ ఫుడ్ ప్రొడక్షన్ అండ్ పేటిస్సేరి, సర్టిఫికెట్ కోర్సు ఇన్‌ఫుడ్ అండ్ బేవరేజ్ సర్వీస్ కోర్సులకు పదో తరగతి పాసైన వారు అర్హులు.

ఈ కోర్సులకు వయో పరిమితి లేదు. కోర్సు పూర్తి చేసిన తర్వాత ఏపీ పర్యాటక శాఖ హోటళ్లు, ప్రముఖ హోటళ్లలో ఉద్యోగావకాశం కల్పిస్తారు. యువతీ యువకులకు వేర్వేరుగా వసతి సౌకర్యం ఉంటుంది. ఈ నెల 25వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలి. 'ఎస్ఐహెచ్ఎంటీపీటీ.ఓఆర్‌జీని సంప్రందించాలి. ఆసక్తిగల విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, మరిన్ని వివరాలకు 97013 43846, 91005 58006, 97004 40604 నెంబర్లలో సంప్రదించాలని కోరారు.

ఎల్ఆర్ఎస్‌ను సద్వినియోగం చేసుకోండి

- తుడా వీసీ శుభం బన్సల్

తిరుపతి, ఆగస్టు17(ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని అనధికార లేఅవుట్లు, ప్లాట్ల క్రమబద్ధీకరణ కోసం ఎల్ఆర్ఎస్ పథకాన్ని పొడిగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం సవరణ ఉత్తర్వులు (జీవో నెంబర్ 134) జారీ చేసిందని తుడా వైస్ ఛైర్మన్ శుభం బన్సల్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 2020 డిసెంబర్ 31 నాటికి దరఖాస్తు చేసుకోలేని స్థల యజమానులకు ప్రయోజనం కల్పించడంతోపాటు ఈ ఏడాది జూన్ 30కు ముందు వేసిన లేఔట్లలో రిజిస్ట్రేషన్ అయిన అనధికార ప్లాట్లను రెగ్యులర్ చేయడానికి ఈ పథకం కొనసాగించారని వివరించారు. మున్సిపల్, స్థానిక సంస్థలు, అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ వెలుపల మాస్టర్ ప్లాన్లు జోనల్ డెవలప్‌మెంట్ ప్లాన్లు పరిధిలోని గ్రామ పంచాయతీలు, పరిశ్రమల ప్రాంత పరిధిలోని ప్రాంతాలకు ఈ స్కీమ్ వర్తిస్తుందన్నారు. స్థలాల ప్లాన్లు తయారు చేసుకుని అపరాధ రుసుంలో 50శాతం లేదా రూ.10వేలకు తగ్గకుండా చెల్లించి దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. నోటిఫికేషన్ ఇచ్చిన రోజు నుంచి 90 రోజుల్లోపు దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు.

శ్రీహరికోట తీరంలో బోటు కలకలం

- బోగోలు మండలం జువ్వలదిన్నె వాసిగా గుర్తింపు
- విచారణానంతరం పంపేసిన పోలీసులు

సూళ్లూరుపేట, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): శ్రీహరికోట సముద్ర తీరం ఒడ్డున ఓ పడవ ప్రత్యక్షమవడంతో కలకలం రేగింది. శ్రీహరికోట పోలీసుల సమాచారం మేరకు.. ఆదివారం తెల్లవారుజామున షార్‌లోని సముద్ర ఒడ్డున పడవతో ఓ వ్యక్తి తిరుగుతుండడంతో బందోబస్తులో ఉన్న సీఐఎస్ఎఫ్ సిబ్బంది గుర్తించారు. బోటుతో పాటు అతడిని అదుపులోకి తీసుకుని విచారించారు. అనంతరం శ్రీహరికోట పోలీసులకు అప్పగించారు. పోలీసుల విచారణలో.. అతడు నెల్లూరు జిల్లా బోగోలు మండలం జువ్వలదిన్నె గ్రామానికి చెందిన సీహెచ్ శ్రీనివాసులు అనే మత్స్యకారుడని తేలింది. చెన్నై వెళ్లి సముద్రంలో చేపలవేట చేసే బోటును కొనుగోలు చేశారు. ఆ బోటును తీసుకుని చెన్నై నుంచి సముద్ర తీరానే శ్రీహరికోట మీదుగా కావలికి వెళుతున్నాడు. సరిగ్గా షార్ వద్దకు వచ్చేసరిగా బోటులో మోటారు మొరాయించింది. చేసేదేమి బోటును సముద్రం ఒడ్డుకు తీసుకొచ్చాడు. సమీపంలో విధుల్లో ఉన్న సీఐఎస్ఎఫ్ సిబ్బంది అనుమానంతో బోటు యజమాని శ్రీనివాసులును అదుపులోకి తీసుకున్నట్లు తేలింది. జువ్వలదిన్నెవాసిగా తేలడంతో, అక్కడి పోలీసులకు సమాచారం ఇచ్చి పూర్తి వివరాలు తెలుసుకున్నాక బోటు యజమానిని పంపించేశారు.

వరి రైతు వెన్ను విరిచిన వర్షం



సూళ్లూరుపేట మండలం మంగళంపాడు సమీపంలో..



కోట మండలం రాజుపాళెం వద్ద పడిపోయిన వరిపైరు

మొన్నటి వరకు పంటను తడుపుకొనేందుకు వర్షం కోసం రైతులు ఎదురు చూశారు. వరి ఎన్ను దశకొచ్చిన ఈ సమయంలో ఆ వర్షమే రైతు వెన్ను విరిచింది. నాలుగైదు రోజులుగా కురుస్తున్న తేలికపాటి జల్లులు, గాలితో వరి కోత దశలో ఉన్న వరి పైరు పూర్తిగా వాలిపోయింది. నీళ్లల్లో మొలకెత్తే దశకు చేరుకోవడంతో రైతులు లబోదిబోమంటున్నారు. కోట మండలంలోని గూడలి, దక్షిణపాలెం, రాజుపాళెం, తిన్నెపూడి, తాటితోపు, ఊనుగుంటపాళెం, రుద్రవరం గ్రామాల్లో రైతులు వరి ఎడగారు సాగు చేపట్టారు. ఆయా పంటలు వెన్నుదశలో, కోత దశలో ఉండగా నేలపై వాలిపోయి కోత కోసేందుకు వీల్లేకుండా పోతోంది. సూళ్లూరుపేట మండలం మంగళంపాడు, మంగానెల్లూరు, కోటపోలూరు, సామంతమల్లాం, మన్నారుపోలూరు, ఇలుపూరు గ్రామాల్లోనూ కోత దశకు వచ్చిన వరిపైరు వర్షం ధాటికి నేలకొరిగింది. ఎన్నుదశలో ఉన్న వరిపైరు వాలిపోవడంతో కోతకు ఇబ్బందిగా మారింది. మొలకలు వస్తే నష్టపోవడమే. పలుచోట్ల వర్షంలోనూ రైతులు పంట నూర్పిడి చేస్తున్నారు. వచ్చిన అరకొర పంటను అమ్ముకుని బయటపడుతున్నారు. మరో రెండు రోజులు ఇదే విధంగా గాలులు, వర్షం కురిస్తే పొలాల్లో వాలిపోయి ఉన్న వరి పైర్లన్నీ మొలకెత్తి పనికిరాకుండా పోతాయి. పెళ్లకూరు మండలంలోనూ వరి కోత దశకురాగా.. వర్షాలతో ఇబ్బంది పడుతున్నారు.

- కోట/సూళ్లూరుపేట, ఆంధ్రజ్యోతి

నేడు పీజీఆర్ఎస్

తిరుపతి(కలెక్టరేట్), ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి ప్రారంభమవుతుందని, సంబంధిత అధికారులు అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు. అర్జీదారులు కలెక్టరేట్‌కు వచ్చే అవసరం లేకుండా వెబ్‌సైట్‌లో కూడా నమోదు చేసుకోవచ్చని తెలిపారు.అర్జీల స్థితిని తెలుసుకునేందుకు 1100 నంబర్‌ను సంప్రదించవచ్చని పేర్కొన్నారు. ఇక మండల, డివిజన్ స్థాయిలోనూ పీజీఆర్ఎస్ జరుగుతుందని, అక్కడ పరిష్కారం కాని వారే కలెక్టరేట్‌కు రావాలని తెలిపారు.

పదిశాతం పెరిగిన మహిళా ప్రయాణికులు

తిరుపతి(ఆర్టీసీ), ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): స్త్రీ శక్తి పథకం అమలుతో శనివారం జిల్లా వ్యాప్తంగా ఆర్టీసీలో పది శాతం మహిళా ప్రయాణికులు పెరిగారు. శ్రీకృష్ణ జన్మాష్టమితో శనివారం సెలవు. దీంతో మహిళా ఉద్యోగులు, కూలీలు దాదాపు ఇళ్లలోనే గడిపారు. ఇతర మహిళల నుంచి ఉచిత ప్రయాణానికి స్పందన లభించింది. పథకం అమలు కాకముందు రోజుకు సగటున దాదాపు 35వేల మంది మహిళలు ఆర్టీసీ బస్సుల్లో తిరిగేవారు. శనివారం వేకువన 12నుంచి అర్ధరాత్రి 12గంటల వరకు తొమ్మిది డిపోల బస్సుల్లో 38,062మంది మహిళలు, 862మంది బాలికలు చొప్పున 38,924 మంది ఉచిత ప్రయాణాన్ని సద్వినియోగం చేసుకున్నారు. వీరికి జీరో టికెట్ కింద రూ.16.90 లక్షలు ఆదా అయినట్లు ఆర్టీసీ పేర్కొంది.

ఉత్సాహంగా ఉట్లోత్సవం

తిరుచానూరు, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): తిరుచానూరులోని పద్మావతి అమ్మవారి ఆలయం వద్ద ఆదివారం సాయంత్రం ఉత్సాహభరిత వాతావరణంలో ఉట్లోత్సవం జరిగింది. అమ్మవారి ఆలయానికి అనుబంధంగా ఉన్న శ్రీకృష్ణస్వామి ఆలయంలో అర్చకులు గోకులాష్టమిని పురస్కరించుకుని విశేషాదిపూజాకార్యక్రమాలు నిర్వహించారు. రుక్మిణీ,సత్యభామ సమేత శ్రీకృష్ణస్వామిని బంగారు తిరుచ్చిపై కొలువుదీర్చి వాహనం మండపంలో వేంచేపు చేశారు. అమ్మవారి ఆలయం ఎదుట టీటీడీ ఉద్యోగులు, అర్చకులు, సిబ్బంది ఉట్లోత్సవంలో పాల్గొన్నారు. యువత ఉత్సాహంతో ఉట్టి కొట్టారు. అనంతరం ఆస్థానంతో గోకులాష్టమి వేడుకలు ముగిశాయి. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఈవోహరీందర్‌నాథ్, శ్రీనివాసాచార్యులు, బాబుస్వామి, మణికంఠస్వామి, సూపరింటెండెంట్ రమేష్, సూపరింటెండెంట్ రమేష్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్లు ప్రసాద్, చలపతి, సుబ్బరాయుడు, సుభాస్కర్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.



ఉట్టి కొడుతున్న టీటీడీ ఉద్యోగులు, అర్చకులు,యువకులు - ప్రత్యేకాలంకారంలో రుక్మిణీ, సత్యభామ సమేత శ్రీకృష్ణుడు

తాగుడు తీసుకొచ్చిన తిప్పలు

- మద్యం తాగి అలిపిరికి చేరుకున్న తండ్రి
- తనిఖీల్లో బస్సు ఎక్కకుండా అడ్డుకున్న భద్రతాసిబ్బంది
- ఈలోపే బస్సులో నిద్రిస్తూ తిరుమల చేరుకున్న చిన్నారి



జ్యోతికి హారికను అప్పగిస్తున్న కంట్రోలర్

తిరుమల, ఆగస్టు17(ఆంధ్రజ్యోతి): బస్సులో నిద్రపోతూ తిరుమల చేరుకున్న ఏడాది పాపను ఆర్టీసీ సిబ్బంది గుర్తించి తల్లికి అప్పగించారు. ఆర్టీసీ అధికారులు తెలిపిన మేరకు.. గూడూరుకు చెందిన వీరయ్య, జ్యోతి తిరుమలలో హాకర్లుగా ఉంటున్నారు. వీరికి ఏడాది వయసున్న కుమార్తె హారిక ఉంది. ఆదివారం ఉదయం ముగ్గురూ తిరుపతికి వెళ్లి సాయంత్రం తిరుమలకు బయలుదేరారు. ఆరు గంటల సమయంలో అలిపిరి చెక్‌పాయింట్ వద్ద.. నిద్రిస్తున్న కుమార్తెను బస్సులోనే ఉంచి వీరు తనిఖీ కోసం కిందకు దిగారు. వీరయ్య మద్యం తాగినట్లు భద్రతా సిబ్బంది గుర్తించి తిరుమలకు వెళ్లేందుకు అడ్డుకున్నారు. ఈ తతంగం జరిగేలోపే బస్సు బయలుదేరి వెళ్లిపోయింది. కొంతసేపటి తర్వాత తల్లి జ్యోతి పాపకోసం బస్సు దగ్గరకు రాగా, తిరుమలకు వెళ్లిపోయినట్టు సమాచారమిచ్చారు. తమ కుమార్తె బస్సులో ఉందని, తమకు అప్పగించాలని భద్రతాసిబ్బందిని ఆమె ప్రాధేయపడ్డారు. దీంతో అలిపిరి సిబ్బంది తిరుమల ఆర్టీసీ అధికారులను సంప్రదించారు. జ్యోతి దంపతుల వద్దనున్న టికెట్ల నెంబర్లు, సీసీ కెమెరాల ఫుటేజ్ ఆధారంగా బస్సును గుర్తించారు. తిరుమల రాంభగీచ ఆర్టీసీ కంట్రోలర్ మైఖేల్ ఆ బస్సును పరిశీలించగా పాప నిద్రిస్తుండటాన్ని గమనించి తన సంరక్షణలోకి తీసుకున్నారు. వెంటనే సమాచారాన్ని అలిపిరి సిబ్బందికి తెలియజేయడంతో జ్యోతి తిరుమలకు చేరుకోగా చిన్నారిని ఆమెకు అప్పగించారు.

వైభవంగా వ్యాస పూజ

- ఇస్కాన్‌లో ముగిసిన శ్రీకృష్ణాష్టమి వేడుకలు



తిరుపతి(కల్చరల్), ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): తిరుపతి ఇస్కాన్ టెంపుల్‌లో మూడు రోజులపాటు జరిగిన శ్రీకృష్ణాష్టమి వేడుకలు ఆదివారం నాటి వ్యాసపూజతో ముగిశాయి. ఆలయంలో అష్టసఖీ సమేత శ్రీకృష్ణుడికి ఉదయం మంగళహారతినిచ్చి భక్తులకు దర్శనం కల్పించారు. తర్వాత దర్శన హారతి అత్యంత వేడుకగా నిర్వహించారు. భక్తివేదాంత స్వామి మందిరంలో ఇస్కాన్ వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకుని వ్యాసపూజను అత్యంత వైభవంగా నిర్వహించారు. వ్యవస్థాపకులు భక్తివేదాంత స్వామి ప్రభుపాద ప్రతిమకు అభిషేకాలు చేశారు. నైవేద్యాలను సమర్పించారు. వినాయకనగర్ మైదానంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా నిర్వహించిన పోటీలలో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.

అక్కా.. నే చనిపోవాలనుకుంటున్నా!

- ఐదు రోజుల కిందట ఫోను చేసిన మనోజ్
- ఎక్కడా ఆచూకీ లేకపోవడంతో పోలీసులకు సోదరి ఫిర్యాదు



మనోజ్‌కుమార్

తిరుపతి (నేరవిభాగం), ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): 'అక్కా, నేను తిరుపతి బస్టాండు వద్ద ఉన్నా. నా వల్ల మీరు అప్పులపాలయ్యారు. అందుకని నేను చనిపోవాలనుకుంటున్నా' అని ఈనెల 12వ తేది ఉదయం 6.30 గంటలకు ఎం.మనోజ్ కుమార్ ఫోను చేశారు. ఆ తర్వాత ఫోను స్విచ్ ఆఫ్ అయింది. అప్పట్నుంచి వెదికినా ఆచూకీ లేకపోవడంతో ఆదివారం తిరుపతి పోలీసులకు నాగపావని ఫిర్యాదు చేశారు. దీంతో మిస్సింగ్ కేసుగా నమోదు చేశారు. వివరాలిలా ఉన్నాయి. ఎం.మనోజ్‌కుమార్‌ది అనంతపురం జిల్లాలోని మండల కేంద్రమైన పామిడి గ్రామం. ఇంటి వద్దే ఉంటున్నారు. షేర్ మార్కెట్లో డబ్బులు పెట్టుబడి పెట్టి నష్టపోయారు. ఈనెల పదో తేది ఉదయం 9 గంటలకు ఫోను చేసి రైలులో తిరుపతికి వెళ్లొస్తానని బయలుదేరి వెళ్లారు. అక్కడ నుంచి తిరుమల కొండకి వెళ్లి శ్రీవారిని దర్శనం చేసుకుని తిరుపతికి వచ్చారు. 12వ తేది ఉదయం 6.30 గంటలకు కళ్యాణదుర్గం మండలంలోని సోదరి నాగపావనికి ఫోనుచేసి చనిపోవాలనుకుంటున్నానని చెప్పి స్విచ్ ఆఫ్ చేయడంతో ఆందోళన చెందారు. 'మేమంతా తిరుపతికి వచ్చి పరిసర ప్రాంతాల్లో వెదికాం. ఎక్కడా మా తమ్ముడి ఆచూకీ తెలియ రాలేదు. మా స్నేహితులు, బంధువులకు చెప్పి వెతకాలని చెప్పాం. ఎంతకీ ఆచూకీ తెలియరాలేదు' అంటూ నాగపావని పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

గూడూరు
సూళ్లూరుపేట/వెంకటగిరి



మర్రినే కప్పేసింది

మర్రిచెట్టు కింద మరే మొలకా మొలవదని అంటారు. కింద అయితే మొలవదు కానీ, మరి పైన..? అందుకేనేమో ఈ గురివింద తీగ ఏకంగా మర్రి చెట్టులోనే మొలిచి అల్లుకుంటూ అల్లుకుంటూ మొత్తం వృక్షాన్నే ఇలా కప్పేసింది. తెల్లటి పూతతో.. కశ్మీర్‌లో మంచురాలిన వృక్షంలా కనిపిస్తోంది. కోట పట్టణంలో శ్యామసుందరపురానికి వెళ్లే దారిలో ఈ శ్వేత సౌందర్యం కనువిందు చేస్తోంది.

- కోట, ఆంధ్రజ్యోతి

గూడూరును జిల్లాగా ప్రకటించాలి



ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న గూడూరు జిల్లా సాధనసమితి సభ్యులు

గూడూరు, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): గూడూరును జిల్లా కేంద్రంగా ప్రకటించాలని గూడూరు జిల్లా సాధన సమితి కన్వీనర్ వేగూరు రాజేంద్ర ప్రసాద్ అన్నారు. ఆదివారం స్థానిక టవర్‌క్లాక్ కేంద్రం నుంచి పట్టణంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఎమ్మెల్యే నివాసం వద్దకు చేరుకుని సునీల్‌కుమార్ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సాధన సమితి ప్రతినిధులు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో సీఎం చంద్రబాబు నాయుడు గూడూరును నెల్లూరు జిల్లాలో కలుపుతామని హామీ ఇవ్వడం జరిగిందన్నారు. జిల్లా పునర్విభజన చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందని భావిస్తోందని, ఈ క్రమంలో గూడూరును జిల్లా కేంద్రంగా ప్రకటించేలా చర్యలు తీసుకోవాలన్నారు. గూడూరును జిల్లా కేంద్రంగా ప్రకటించేందు అన్ని వనరులు ఉన్నాయని, ఈ దిశగా చర్యలు చేపట్టాలని కోరుతున్నామన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గూడూరు ప్రజల ఆకాంక్షను మంత్రుల కమిటీ వద్దకు తీసుకువెళతామన్నారు. నియోజకవర్గంలోని చిల్లకూరు మండలంలో అనేక పరిశ్రమలు ఏర్పాటు అవుతున్నాయన్నారు. సాగరమాల రోడ్లు రూపుదిద్దుకుంటున్నాయన్నారు. వీటన్నింటినీ మంత్రుల కమిటీ దృష్టికి తీసుకువెళ్లి గూడూరును జిల్లా ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో సుమన్‌రెడ్డి, అశోక్, గోపి, పురుషోత్తం, వెంకటేశ్వర్లు, అరుణ్‌కుమార్, దినేష్, ఇబ్రహీం, విజయ్, రాజేష్, శివ తదితరులు పాల్గొన్నారు.

నేడు పోలేరమ్మ ఆలయ ఆర్చి ప్రారంభం

వెంకటగిరి, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ సొంత నిధులు రూ.50 లక్షలు వెచ్చించి పట్టణంలోని క్రాస్‌రోడ్డులో నిర్మించిన పోలేరమ్మ ఆలయ ఆర్చి నిర్మాణం ఎట్టకేలకు పూర్తి చేశారు. సోమవారం ఆర్చిని ప్రారంభించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆదివారం ఎమ్మెల్యే ఆర్చిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను ఆర్చి నిర్మిస్తామని గతంలో అమ్మవారికి మొక్కుకున్నానని, ఆ మొక్కు చెల్లించుకొనేందుకు ఇంతకాలం పట్టిందన్నారు. సోమవారం ఉదయం 9 గంటలకు ఆర్చిని ప్రారంభిస్తామని చెప్పారు. కార్యక్రమంలో పోలేరమ్మ ఆలయ ఈవో శ్రీనివాసులు రెడ్డి, పద్మశాలలి కార్పొరేషన్ డైరెక్టర్ శ్రీరాందాస్ గంగాధర్, యాసవరం, వెంకటగిరి, లింగసముద్రం వ్యవసాయ మార్కెట్ కమిటీల అధ్యక్షులు సీసీ నాయుడు, పప్పు చంద్రమౌళి రెడ్డి, రంగినేని రాజా, రాష్ట్ర బ్లయిండ్ స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పరుచూరి నరసయ్య నాయుడు, బాలాయపల్లి మండల టీడీపీ అధ్యక్షుడు రావి మస్తాన్ నాయుడు, గొల్లగుంట మురళీకృష్ణ, బీరం రాజేశ్వరరావు, వెంకటముని, బాబు నాయుడు, తదితరులు పాల్గొన్నారు.


భవన నిర్మాణ సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న రవి

గూడూరు, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణ సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు రవి అన్నారు. ఆదివారం స్థానిక ఏఐటీయూసీ కార్యాలయంలో భవన నిర్మాణ కార్మికుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మిక సంఘం సంక్షేమ నిధులను రాష్ట్ర ప్రభుత్వం ఇతర అవసరాలకు వినియోగించి కార్మిక సంక్షేమ చట్టాలను నిర్వీర్యం చేశాయన్నారు. భవన నిర్మాణ కార్మికుల పిల్లల చదువులు, పెళ్లిలు, ప్రసవవాలకు ఇవ్వాల్సిన డబ్బులను అందజేయడం లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికులను ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో శ్రీకాంత్, సీవీఆర్‌కుమార్, బాబు, రాజా, చెంచురామయ్య, ప్రభాకర్, శశికుమార్ తదితరులు పాల్గొన్నారు.

జేవీవీ సేవలు ఆదర్శనీయం



దివ్యాంగులకు కూరగాయలు, కోడిగుడ్లు అందజేస్తున్న మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు

గూడూరు, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): జేవీవీ నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలు ఆదర్శనీయమని మున్సిపల్ కమిసనర్ వెంకటేశ్వర్లు అన్నారు. ఆదివారం స్థానిక విశ్రాంత ఉద్యోగుల భవనంలో జేవీవీ ఆధ్వర్యంలో ప్రభాకర్ దాతృత్వంతో దివ్యాంగులకు కూరగాయలు, కోడిగుడ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో సైన్స్‌పట్ల అవగాహన పెంపొందించడంలో జేవీవీ ఎంతో కృషి చేస్తోందన్నారు. పేదలకు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ స్ఫూర్తిగా నిలుస్తోందన్నారు. కార్యక్రమంలో వేగూరు రాజేంద్రప్రసాద్, నాగరాజు, సుమన్‌రెడ్డి, ఇబ్రహీం, శ్రీనివాసాచారి, అశోక్, అరుణ్‌కుమార్, సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఎస్‌డీ టిక్కెట్ల కోసం పడిగాపులు
విష్ణునివాసం వద్ద జోరువానలో తడుస్తూ భక్తుల అవస్థలు

తిరుపతి(కల్చరల్), ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): వరుస సెలవుల నేపథ్యంలో తిరుమలేశుడి దర్శనం కోసం వచ్చే భక్తుల రద్దీ కొనసాగుతోంది. తిరుపతిలోని విష్ణు నివాసం వద్ద సర్వదర్శనం టిక్కెట్ల కోసం క్యూలలో పడిగాపులు కాశారు. వర్షం పడుతున్నా లెక్క చేయకుండా బారులు తీరారు. కొంతమంది గొడుగులు అడ్డుపెట్టుకోగా మరికొందరు టోపీలు, కర్చీఫ్‌, తువాలును తలకు పెట్టుకున్నారు. క్యూలైన్ల వద్ద షైకప్పులు అమర్చకపోవడం వల్ల అటు ఎండ వేడిమికి తల్లడిల్లుతూ ఇటు వర్షానికి తడుస్తూ భక్తులు అవస్థలు పడాల్సిన పరిస్థితి ఏర్పడింది. టీటీడీ అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకోవాల్సి ఉంది.

దాడి కేసులో ఐదుగురి అరెస్ట్

దొరవారిసత్రం, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): దొరవారిసత్రం మండలం హరిగుండ్రం గ్రామానికి చెందిన సమ్మని రాజయ్యపై దాడి చేసి గాయపరిచిన కేసులో ఐదుగురిని అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచినట్లు ఎస్ఐ అజయ్ కుమార్ తెలిపారు. రెండు రోజుల క్రితం ఆనేపూడి వద్ద రాజయ్యపై వడికండ్రిగ గ్రామానికి చెందిన వల్లిపి నారయ్య, మరో నలుగురు రాజయ్యపై దాడి చేసి గాయపరిచారని చెప్పారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని, ఆదివారం నిందితులను అరెస్టు చేసి సూళ్లూరుపేట మెజిస్ట్రేట్ ముందు హాజరు పరచగా రిమాండ్ విధించినట్లు ఎస్ఐ తెలిపారు. నిందితుల్లో నలుగురు బాలురు కావడంతో వారిని చిల్డ్రన్స్ హోమ్‌కు తరలించినట్లు తెలిపారు.

రెండు బైక్‌ల ఢీ: ఒకరికి గాయాలు

నాయుడుపేట టౌన్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని తుమ్మూరు సమీపంలో రెండు మోటారు సైకిళ్లు ఢీకొన్న సంఘటనలో ఒకరికి గాయాలయ్యాయి. పట్టణానికి చెందిన సుబ్రహ్మణ్యం మోటారు సైకిల్‌పై ఆదివారం రాత్రి గూడూరు వైపు వెళ్తుండగా తుమ్మూరు సమీపంలో ఎదురుగా వస్తున్న మోటారు సైకిల్ ఢీకొంది. ఈ ప్రమాదంలో సుబ్రహ్మణ్యంకు గాయాలవడంతో స్థానికులు నాయుడుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

ఎడతెరపిలేని వర్షం

వెంకటగిరి టౌన్, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): బంగాళఖాతంలో ఏర్పడి అల్పపీడనం కారణంగా వెంకటగిరిలో శనివారం రాత్రి నుంచి ఎడతెరపి లేని వర్షం కురుస్తోంది. ఆదివారం కూడా వర్షం కురవడంతో ఇళ్ల నుంచి ప్రజలు బయటకు రాలేకపోయారు.



దాతలు అందజేసిన ఎక్స్‌రే మెషిన్, తాళం వేసివున్న ఎక్స్‌రే గది - ఆస్పత్రి ప్రాంగణంలో చెట్లకింద నిరుపయోగంగా అంబులెన్స్

దాతలిచ్చినవీ వినియోగించుకోలేరా?
ప్రభుత్వాస్పత్రిలో నిరుపయోగంగా ఎక్స్‌రే మెషిన్ ● రెండేళ్లుగా మూలన ఉన్న అంబులెన్స్

సూళ్లూరుపేట, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): డివిజన్ కేంద్రమైన సూళ్లూరుపేట ప్రభుత్వాస్పత్రిలో ఉన్న సౌకర్యాలనూ వినియోగించేకోలేని దుస్థితి నెలకొంది. ఈ ఆస్పత్రికి రోజుకు 150నుంచి 220 మంది వరకు రోగులు వస్తుంటారు. తడ, సూళ్లూరుపేట, దొరవారిసత్రం మండలాల్లో జాతీయ రహదారిపై తరచూ జరిగే ప్రమాదాల్లో క్షతగాత్రులను సూళ్లూరుపేట ప్రభుత్వాస్పత్రికి తీసుకొస్తుంటారు. అయితే ఇక్కడ ఆధునిక వైద్య పరికరాలు, సామగ్రి లేకపోవడంతో బాధితులను తిరుపతి, నెల్లూరు, గూడూరు, చెన్నైకు తీసుకెళ్లమని వైద్యులు సిఫార్సు చేస్తున్నారు. అంతదూరం వెళ్లేసరికి మార్గమధ్యంలో చాలామంది మృతి చెందిన ఘటనలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో స్వర్ణటోల్ ప్లాజా యాజమాన్యం స్పందించింది. 2020ఏప్రిల్‌లో కార్పొరేట్ సామాజిక బాధ్యత కింద గూడూరు, సూళ్లూరుపేట ఆస్పత్రులకు ఆధునాతన సాంకేతికతో కూడిన ఎక్స్ రే మెషిన్‌లను అందించింది. గూడూరు ఆస్పత్రిలో అదే ఏడాది సెప్టెంబరులో వినియోగంలో తెచ్చారు. అయితే సూళ్లూరుపేట ఆస్పత్రిలో ఎక్స్ రే గదికి తాళాలు వేసి పెట్టారు. అలాగే శ్రీసిటీలోని ఓ పరిశ్రమ రూ.30 లక్షలు విలువ చేసే అంబులెన్స్‌ను సూళ్లూరుపేట ప్రభుత్వాస్పత్రికి అందజేసి రెండేళ్లు అవుతున్నా అది నిరుపయోగంగా ఉంది. వైసీపీ పాలనలో అసలు వీటి గురించి పట్టించుకోలేదు. కూటమి ప్రభుత్వం ఈ ఏడాది జనవరిలో హెచ్‌డీసీ కమిటీ నియమించింది. కమిటీ సభ్యులు ఆస్పత్రిని తనిఖీ చేశారు. ఎక్స్‌రే గదితో పాటు పలు కీలక విభాగాల్లో వైరింగ్ బాగలేకపోవడంతో విద్యుత్ సరఫరా సక్రమంగా లేదని గుర్తించారు. వెంటనే ఎమ్మెల్యే విజయశ్రీ దృష్టికి తీసుకెళ్లారు. ఆమె ఆస్పత్రిని తనిఖీ చేసి ఎక్స్ రే గది, యంత్రాలను పరిశీలించి వైద్యులు, సంబంధిత అధికారులతో మాట్లాడారు. ఎంఎస్ అగర్వాల్, సీసీఎల్ పరిశ్రమల సహకారంతో రూ.3.50 లక్షలు ఖర్చుచేసి విద్యుత్ వైరింగ్‌తో పాటు ఎక్స్‌రే మెషిన్ గదిని ఆధునికీకరించి వినియోగంలోకి తెచ్చేందుకు చొరవ తీసుకున్నారు. ఇది జరిగి నాలుగు నెలలైనా ఎక్స్ రే మెషిన్ వినియోగంలోకి రాలేదు. ఎక్స్ రే మెషిన్ టెక్నీషియన్ మూడేళ్లుగా ఆస్పత్రికి రావడంలేదు. అతను నెల్లూరులో ఉంటూ నెలలో ఒకరోజు వచ్చి జీతం తీసుకుని వెళుతున్నట్లు తెలిసింది. ఈ విషయమై ఆస్పత్రి సూపరింటెండ్ కూడా పట్టించుకోడం లేదని సిబ్బందే చెబుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి దాతలు ఇచ్చిన ఎక్స్ రే మెషిన్, అంబులెన్స్‌ను వినియోగంలోకి తెచ్చేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.



జీలపాటూరు వర్షాలకు నేల వాలిన వరి పంట

వర్షాలకు నేలవాలిన వరి పంట

పెళ్లకూరు, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): మూడు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు కోత దశలో ఉన్న వరి పంట నేల కొరిగింది. రానున్న రెండు, మూడు రోజులు బారీ వర్షాలు కురుస్తాయన్న వాతావరణ శాఖ హెచ్చరికలతో వరి పంటకు మరింత నష్టం వాటిల్లే ప్రమాదముందని రైతులు ఆందోళన చెందుతున్నారు. జీలపాటూరు, చిల్లకూరు, చావాలి, పెళ్లకూరు, కొత్తూరు, రావులపాడు, బీమవరం, నెలబల్లి పుల్లూరు, పసుపుకండ్రిగ, కలవకూరు కప్పగుంటకండ్రిగ గ్రామాల్లో రైతులు సాగుచేసిన వరి కోత దశకు చేరుకుంది. ఇప్పుడిప్పుడే నూర్పిడి ప్రారంభించిన రైతులు ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడుతుండడంతో చేతికి అందివచ్చిన పంట నేల పాలవుందని ఆందోళన చెందుతున్నారు.

వర్షంతో అన్నదాతల అవస్థలు

సూళ్లూరుపేట, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): రెండు రోజుల నుంచి కురుస్తున్న వర్షంతో ప్రజలతో పాటు అన్నదాతలకు అవస్థలు తప్పలేదు. చేతికొచ్చిన ధాన్యాన్ని అమ్ముకోలేక కల్లాల్లో, ఇతర ప్రాంతాల్లో ధాన్యం రాసుల పోసి నిల్వచేసిన రైతులకు వర్షంతో తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పలుచోట్ల వర్షంలోనూ రైతులు పంట నూర్పిడి చేస్తున్నారు. ధరలేక పొలాల్లోనే నిల్వ చేసుకున్న ధాన్యం వర్షానికి తడవకుండా వేరే ప్రాంతాలకు తరలించి భద్రపరుచుకుంటున్నారు. మొన్నటి వరకు పంటను తడుపుకునేందుకు వర్షం కోసం ఎదురుచూసిన రైతులకు ఎన్నుదశలో చేతికొచ్చిన సమయంలో వర్షాలతో వెన్ను విరిచినట్లయ్యింది.



పొలాల వద్ద నిల్వచేసిన ధాన్యాన్ని విక్రయానికి తరలిస్తున్న రైతులు

మూగ జీవాలకు వైద్యం చేసేదెవరు?

- పశువైద్య కేంద్రాల్లో డాక్టర్లే లేరు
- రోగాలతో పశువుల మృత్యువాత
- ఆర్థికంగా నష్టపోతున్న రైతులు



బాలాయపల్లి పశువైద్యశాల

బాలాయపల్లి, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): బాలాయపల్లి మండలంలోని మూగ జీవాల వైద్యం చేసేవారే కరువయ్యారు. బాలాయపల్లి, చిలమనూరు, జయంపు గ్రామాల్లో పశువైద్య కేంద్రాలు ఉండగా ఒక్క చోట కూడా వైద్యులు లేరు. రెండేళ్లుగా జయంపులో పశువైద్యాధికారి లేకపోగా, చిలమనూరు పశువైద్యశాల వైద్యాధికారి దీర్ఘకాలిక సెలవుపై వెళ్లారు. బాలాయపల్లి పశువైద్యాధికారి ఇటీవల జరిగిన బదిలీల్లో నెల్లూరు జిల్లా సైదాపురానికి వెళ్లారు. సచివాలయాల పరిధిలో పశుసంరక్షణ అసిస్టెంట్లు ఉన్నా వారు ఎప్పుడు వస్తారో ఎప్పుడు వెళతారో ఎవ్వరికీ తెలియదు. మండలంలో వేలాదిమంది పశువుల పెంపకం ఆధారంగా జీవనం సాగిస్తున్నారు. ఆవులతో పాటు గేదెలు, గొర్రెలు, మేకలు పెద్దసంఖ్యలో ఉన్నాయి. వైద్యులు, సిబ్బంది అందుబాటులో లేకపోవడంతో ఏటా రోగాల బారిన పడి పశువుల, గొర్రెలు, మేకలు వందలాదిగా చనిపోతున్నాయి. దీంతో రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి బాలాయపల్లి మండలంలోని పశువైద్య కేంద్రాల్లో వైద్యులను నియమించాల్సిన అవసరం ఉంది.

టిడ్కో గృహాల్లో కార్డన్ సెర్చ్



స్వాధీనం చేసుకున్న వాహనాలతో పోలీసులు

వెంకటగిరి టౌన్, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): స్థానిక తిరుపతి రోడ్డులో ఉన్న టిడ్కో గృహాల్లో ఆదివారం పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహించారు. సరైన పత్రాలు లేని ఆరు ద్విచక్ర వాహనాలు, ఆరు ఆటోలను సీజ్ చేశారు. ఈ సందర్భంగా సీఐ రమణ మాట్లాడుతూ తగిన ధృవీకరణ పత్రాలు లేకుండా తిరిగే వాహనాలను సీజ్ చేయడంతో పాటు కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో వెంకటగిరి, డక్కిలి ఎస్ఐలు ఏడుకొండలు, శివశంకర్, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

పద్మారావుపై విమర్శలు తగవు



కార్యక్రమంలో మాట్లాడుతున్న బహుజన ఐక్యవేదిక నాయకులు

కోట, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): దళిత బహుజన ఉద్యమనేత కత్తి పద్మారావుపై విమర్శలు చేయడం సరికాదని ఆ సంఘం నాయకులు అన్నారు. ఆదివారం దళిత మహాసభ బహుజన ఐక్యవేదిక, ఎమ్మార్పీఎస్, ఉద్యమ సంఘాలు కోటలోని అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కారంచేడు కేసులో ప్రధాన నిందితుడైన దగ్గుపాటి చెంచురామయ్య కుమారుడు వెంకటేశ్వరరావు తన తండ్రిని అడ్డంపెట్టుకొని బహుజన ఉద్యమ నాయకుడు కత్తి పద్మారావు ఎదిగారని చెప్పడం హాస్యాస్పదమన్నారు. కారంచేడు ఉద్యమానికి ఊపిరిపోసిన కత్తి పద్మారావుపై వెంకటేశ్వరరావు చేసిన వ్యాఖ్యలు వెనక్కుతీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బహుజన ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు మీజూరు మాధవ్, ద్రాసరి సుందరం, లేగూరు విజయ కుమార్, మదన్ మిత్ర, పాలా మల్లికార్జున్, పనబాక హేమంత్, శంకరయ్య, కేశవ్, కృష్ణ శ్రీను, కోటేశ్వరరావు, ప్రసాద్, రాజముని, రవీంద్ర, రాకేష్, రాజా, అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయండి

గూడూరు, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులో ఈనెల 23వ తేదీన జరగనున్న సీపీఐ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు ప్రభాకర్ అన్నారు. ఆదివారం స్థానిక సీపీఐ కార్యాలయం వద్ద మహాసభల పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో శశికుమార్, రవి, సీవీఆర్ కుమార్, రాజా, చెంచురామయ్య, మస్తాన్, జమాల్ తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి నాయుడుపేటలో చెన్నై ఎక్స్‌ప్రెస్‌కు స్టాపింగ్

నాయుడుపేట, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): హైదరాబాదు (చర్లపల్లి) - నుంచి చెన్నై వెళ్లే చెన్నై ఎక్స్‌ప్రెస్ (రైలు నెంబరు 12604)కు ఈనెల 19వ తేదీ మంగళవారం నుంచి నాయుడుపేట రైల్వే స్టేషన్‌లో ఆపనున్నట్లు సదరన్ రైల్వే ప్యాసింజర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు మస్తానయ్య, ప్రధాన కార్యదర్శి పేర్నాటి జోసెఫ్, కార్యదర్శులు ఆర్.రాఘవన్, కె.కిరణ్ తెలిపారు. ఆదివారం వారు మాట్లాడుతూ గతంలో చెన్నై ఎక్స్‌ప్రెస్ నాయుడుపేటలో ఆగుతుండగా, కొవిడ్ సమయంలో స్టాపింగ్ ఎత్తేశారని చెప్పారు. తిరుపతి ఎంపీ గురుమూర్తి, సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ కృషితో నాయుడుపేటలో చెన్నై ఎక్స్‌ప్రెస్‌కు స్టాపింగ్ పునరుద్ధరిస్తూ సదరన్ రైల్వే అధికారులు ఉత్తర్వులు జారీ చేశారని చెప్పారు.

పేదలకు నిత్యావసరాల పంపిణీ



పేదలకు నిత్యావసరాలు అందజేస్తున్న సింహపురి రెడ్డి సంక్షేమ సంఘం ప్రతినిధులు

గూడూరు అర్బన్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక డీఎస్ఆర్ కమ్యూనిటీ హాలులో ఆదివారం సింహపురి రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పేదలకు నిత్యావసరాలను అందజేశారు. ఈ సందర్భంగా సంస్థ సభ్యులు మాట్లాడుతూ ప్రతినెలా తమ సంఘం ఆధ్వర్యంలో డాక్టర్లు జనార్దనరెడ్డి, రోహిణి సహకారంతో పేదలకు నిత్యావసరాలను అందజేస్తున్నామన్నారు. కార్యక్రమంలో సనత్‌కుమార్‌రెడ్డి, శ్రీనివాసులురెడ్డి, ధనుంజయరెడ్డి, విజయభాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

ముత్యాలమ్మకు పూజలు



చిల్లకూరు, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తూర్పు కనుపూరు గ్రామంలో వెలసిన ముత్యాలమ్మకు ఆదివారం ప్రత్యేక పూజలు జరిగాయి. పలు గ్రామాల నుంచి వచ్చిన భక్తులు ఆలయం వద్ద పొంగళ్లు పెట్టుకుని నైవేద్యం నివేదించి ప్రత్యేక అలంకారంలో ఉన్న అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయం ఎదుట ఉన్న త్రిశూలం వద్ద టెంకాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం తీర్థప్రసాదాలు స్వీకరించారు.

కోటమ్మకు పూజలు



కోట, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): కోట గ్రామదేవత కోటమ్మకు ఆదివారం విశేష పూజలు జరిగాయి. అమ్మవారికి అభిషేకాలు చేసి చందన, పుష్పాలంకరణలో ఉంచారు. కోట, వాకాడు, చిట్టమూరు, చిల్లకూరు, ఓజిలి మండలాలకు చెందిన భక్తులు అమ్మవారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు ఆలయ పాలకమండలి ఆధ్వర్యంలో తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

పరసా కస్తూరమ్మకు వేనాటి నివాళి

సూళ్లూరుపేట, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి పరసా వెంకటరత్నం సతీమణి పరసా కస్తూరమ్మ వర్ధంతి ఆదివారం తిరుపతిలో జరిగింది. కస్తూరమ్మ చిత్రపటానికి టీటీడీ బోర్డు మాజీ సభ్యుడు వేనాటి రామచంద్రారెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. అలాగే టీడీపీ నాయకులు పాకం వెంకటసుబ్బయ్య, సుధాకర్‌రెడ్డి, గొంజి వెంకటేశ్వర్లు, కృష్ణా, మనోహర్ తదితరులు నివాళులర్పించారు.

వర్షాల పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలి

చిట్టమూరు, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): వర్షాలు కురుస్తున్నందున రైతులు అప్రమత్తంగా ఉండాలని వ్యవసాయాధికారి నిరంజన్ కుమార్ సూచించారు. వరి పంట కోతకొచ్చి నూర్పిడి చేసుకొనే సమయంలో వర్షాలు పడడం వల్ల పంట నేల వాలిపోయి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని అన్నారు. మండలంలోని మెట్టు, ఎం.జంగాళపల్లి, అద్దెపూడి, పెళ్లకూరు, గునపాడు, గునపాటిపాళెం, చిట్టమూరు గ్రామాల్లో వరి పైరు నేలవాలిపోయి నీళ్లల్లో ఉందన్నారు. నేలకొరిగిన వరి ఎన్నుపై లీటరు నీటికి 50 గ్రాముల ఉప్పు ద్రావణాన్ని కలిపి పిచికారీ చేయాలని సూచించారు. దీనివల్ల 10 నుంచి 20 రోజులు వరి గింజలు మొలకెత్తవని, అంతేకాక రంగు మారకుండా ఉంటుందని చెప్పారు. వరి నూర్పిడి చేసి కల్లాల్లో పోసిన ధాన్యం తడిసిపోతే క్వింటాకు కేజీ ఉప్పుతో పాటు నాలుగు కేజీల ఊక లేదా, నాలుగు కేజీల ఎండు గడ్డిని చిన్నచిన్న ముక్కలు చేసి ధాన్యం రాశుల్లో కలిపిన వారం రోజుల తరువాతైన ఎండబెట్టుకొని అమ్ముకోవచ్చన్నారు.

ఉత్సాహంగా ఉట్టి మహోత్సవం



ఉట్టిని కొడుతున్న చిన్నారులు

సూళ్లూరుపేట, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట పట్టణంలోని స్వతంత్రపురంలో యాదవ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కృష్ణాష్టమి వేడుకలు ఆదివారం రెండో రోజు ఘనంగా జరిగాయి. సాయంత్రం ఉట్టి మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. యువకులు, చిన్నారులు ఉత్సాహంగా ఉట్టిని కొట్టారు. అనంతరం కోలాటం, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

నాయుడుపేట టౌన్: పట్టణంలోని రాజగోపాలపురంలో ఉట్టి మహోత్సవం ఘనంగా నిర్వహించారు. కృష్ణాష్టమి వేడుకల్లో భాగంగా ఆదివారం సాయంత్రం రాజగోపాలపురంలోని శ్రీరామమందిరం వద్ద ఉట్టి మహోత్సవం నిర్వహించారు. చిన్న, పెద్ద తేడా లేకుండా ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ కోలాహలంగా ఉట్టి మహోత్సవంలో పాల్గొన్నారు.

కన్నుల పండువగా శ్రీకృష్ణ కల్యాణోత్సవం



పెళ్లకూరు, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): శ్రీకృష్ణ జన్మాష్టమి పర్వదినాన్ని పురస్కరించుకుని పెళ్లకూరు మండలం చెన్నప్పనాయుడుపేట గ్రామంలో ఆదివారం రాత్రి స్వామివారి కల్యాణోత్సవ వేడుక కమనీయంగా జరిగింది. రుక్మిణి, సత్యభామ సమేత శ్రీకృష్ణ మందిరంలో ఏటా కృష్ణ జయంతి వేడుకలు మూడురోజుల పాటు వైభవోపేతంగా జరుగుతాయి. ఈ ఏడాది యువత ముందుకొచ్చి కృష్ణాష్టమి సంబరాలను దిగ్విజయంగా నిర్వహించారు. కల్యాణోత్సవం అనంతరం రుక్మిణి, సత్యభామ సమేత శ్రీకృష్ణులను గ్రామంలో ఊరేగించారు. భక్తులు నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. సోమవారం స్వామి, అమ్మవార్లకు వసంతాలు నిర్వహిస్తామని గ్రామపెద్దలు తెలిపారు.